రెండోరోజూ..
- కొనసాగిన ఏపీఎస్పీ రేంజ్-1 క్రీడాపోటీలు.. నేడు ముగింపు
- అతిథులుగా పాల్గొంటున్న బెటాలియన్స్ ఐజీపీ రాజకుమారి, డీఐజీ ఫకీరప్ప

7

మళ్లీ 'నామినేటెడ్' సందడి

- ఉమ్మడి 'తూర్పు' జిల్లాలో నాలుగు మార్కెట్ కమిటీలకు చైర్మన్ల ప్రకటన
- నాలుగు ఏఎంసీలూ టీడీపీకి కేటాయింపు

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మరోసారి నామినేటెడ్ పదవుల సందడి నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వం పలు మార్కెట్ కమిటీలకు చైర్మన్లను ప్రకటించింది. రాష్ట్రవ్యాప్తంగా 30 ఏఎంసీ చైర్మన్ల జాబితాను బుధవారం విడుదల చేయగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో నలుగురిని నియమించారు. నాలుగు మార్కెట్ కమిటీలను టీడీపీకి కేటాయించారు. కాకినాడ జిల్లాలోని కాకినాడ అర్బన్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బచ్చు శేఖర్, తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మార్ని వాసుదేవ్, కొవ్వూరు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నాదెళ్ల శ్రీరామ్ చౌదరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మార్కెట్ కమిటీ చైర్మన్‌గా అయినవిల్లి టీడీపీమండల అధ్యక్షుడు చిట్టూరి శ్రీనివాస్‌ను నియమించారు.

22నుంచి డెల్టా కాలువలు మూసివేత

- ఇరిగేషన్ మంత్రి ఆదేశాలతో కాలువల మూసివేత గడువు పెంపు

ధవళేశ్వరం,ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ఈనెల 22నుంచి డెల్టా కాలువలు మూసివేయనున్నారు. రబీ అనంతరం ఖరీఫ్‌లో సాగునీరు సక్రమంగా పారేందుకు డెల్టా కాలవల షెట్టర్ లు, లాకులు వంటి మరమ్మతులు(క్లోజర్ పనులు) చేపట్టడానికి కాల్వలకు నీటి విడుదల నిలిపివేస్తారు. డెల్టా కాలువలు ఈనెల 16నే మూసివేసేందుకు సిద్ధంకాగా గ్రామాల్లో తాగునీటి చెరువులు నింపుకోవడానికి ఇతరత్ర అవసరాలకోసం ఈ నెల 22 వరకు నీటిని విడుదలకు గడువు పెంచారు. ఇరిగేషన్ మంత్రి ఆదేశాలతో కాల్వల మూసివేతను 22వరకు వాయిదా వేశారు. కాగా బుధవారం కాటన్‌బ్యారేజ్‌నుంచి తూర్పుడెల్టాకు 1200 క్యూసెక్కులు, మధ్యడెల్టాకు 1100 క్యూసెక్కులు, పశ్చిమడెల్టాకు 3వేలక్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. ధవళేశ్వరంవద్ద నీటిమట్టం 9.30 అడుగులుగా నమోదైంది.

● రబీని గట్టెక్కించిన సీలేరు జలాలు

తూర్పు, మధ్య, పశ్చిమ డెల్టాలోని 8.96లక్షల ఎకరాలకు రబీలో సాగునీటిని సమవృద్ధిగా అందించారు. డిసెంబర్‌నుంచి నేటివరకు మూడు డెల్టా కాలువలకు 114.644 టీఎంసీల నీటిని కాటన్ బ్యారేజ్ నుంచి విడుదల చేశారు. సీలేరు నుంచి పవర్ జనరేషన్‌ద్వారా 44.084 టీఎంసీలు గోదావరికి విడుదల కాగా, బైపాస్ మార్గం ద్వారా నేరుగా 17.781టీఎంసీలు విడుదల చేశారు. సీలేరునుంచి మొత్తం 61.865 టీఎంసీలు గోదావరికి విడుదలయ్యాయి. పోలవరంవద్ద 16 టీఎంసీల నీటి నిల్వలు ఉంటాయని అధికారులు లెక్కకట్టగా రబీ సీజన్‌లో గోదావరిలో సహజ జలాల లభ్యత 36 టీఎంసీలకు పైగా ఉంది. గత రబీసీజన్‌లో అప్పటి వైసీపీ ప్రభుత్వ విధానాలతో రైతులు తీవ్ర సాగునీటి ఎద్దడి నెలకొన్నారు. అప్పట్లో మార్చి నెలాఖరు నాటికి ధవళేశ్వరంవద్ద గోదావరి నీటిమట్టం 5.50అడుగులకు పడిపోయింది. పాండ్‌లో నీరు డెల్టా కాలువలకు ప్రవహించని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం సాగునీటి సంఘాలు, ప్రాజెక్టు కమిటీ సభ్యులు, ఇరిగేషన్, వ్యవసాయశాఖ అధికారుల సమన్వయంతో రబీకి సమృద్ధిగా సాగునీరందించారు.



ప్లస్ కాదు.. మైనస్!

- ప్లస్ 2 ఇంటర్‌తో అవస్థ
- హైస్కూళ్లలో సౌకర్యాలు కరువు
- సున్నా ఫలితాలు..దిగజారిన ఉత్తీర్ణత
- విద్యార్థుల భవితతో చెలగాటం
- జగన్ అనాలోచిత నిర్ణయం ఫలితం
- గతేడాది పాస్ శాతం అంతంతే
- ఏడాదైనా మారని తీరు..
- సర్కారు దృష్టి పెట్టాల్సిందే..

ఇంటర్ అంటే విద్యార్థి భవిష్యత్.. అక్కడ వేసిన అడుగే ముందుకు నడిపిస్తుంది.. ఇంజనీరింగ్.. మెడిసిన్.. ఐఐటీ..జేఈఈ వంటి ఉన్నత చదువులకు పునాది ఇక్కడే.. అటువంటి పునాదికి జగన్ మంగళం పాడేశారు. రెండేళ్ల కిందట వైసీపీ ప్రభుత్వ హయాంలో హైస్కూల్స్‌లో 'ప్లస్' అంటూ ఉన్నత పాఠశాలల్లో ఆర్భాటంగా ఇంటర్మీడియట్ కోర్సులను ప్రారంభించారు.విద్యార్థుల బోధన అంశాన్ని గాలికొదిలేశారు. దీంతో హైస్కూల్ ప్లస్‌లు విద్యార్థుల జీవితాలను మైనస్‌లో పడేస్తున్నాయి. ఈ ఏడాది కొన్ని పాఠశాలల్లో ఒక్కరూ పాస్ కాలేదంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. కూటమి ప్రభుత్వం దీనిపై పునరాలోచించాలి.

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

హైస్కూల్ ప్లస్ అనేది రెంటికీ చెడ్డ రేవడిగా తయారైంది.పాఠశాల విద్యాశాఖ పదో తరగతి వరకూ దృష్టి సారిస్తోంది. జూనియర్ కళాశాలల్లో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని ఇంటర్ బోర్డు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తోంది. కానీ హైస్కూల్ ప్లస్ మాత్రం ఎటు కాకుండా పోతోంది. దీంతో విద్యార్థుల చదువు చతికిలబడుతోంది.గత వైసీపీ ప్రభుత్వంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 'హైస్కూలు ప్లస్' పేరుతో ఏర్పాటు చేసిన ఇంటర్‌కు రెండేళ్లలో పరీక్షలకు హాజరైన విద్యార్థుల ఉత్తీర్ణత గణనీయంగా పడిపోయింది.కొన్ని స్కూళ్లలో అయితే సున్నా ఫలితాలు వచ్చాయి.హైస్కూలు ప్లస్‌లో సరైన మౌళిక సదుపాయాలు, నిపుణులైన అధ్యాపకులు లేకపోవడంతో విద్యార్థుల భవిత పూర్తిగా అంధకారమైంది. ఇంటర్ ప్రథమ, ద్వితీయ విద్యార్థులకు హైస్కూలు ఉపాధ్యాయులతోనే విద్యాబోధనను మమ అనిపించారు.దాంతో ఆ హైస్కూలు ప్లస్‌లో చదివిన విద్యార్థులు ఉత్తీర్ణత శాతం గణనీయంగా పడిపోయింది.

ఇంటర్ విద్యార్థుల భవిత జీరో

ఏ జిల్లా చూసినా ఇదే తీరు..

తూర్పుగోదావరి జిల్లాలో 22 ఉన్నత పాఠశాలల్లో 'హైస్కూల్ ప్లస్' అనే పేరుతో ఇంటర్మీడియట్ మొదటి ఏడాది కోర్సులను ప్రారంభించారు. తర్వాత రెండో ఏడాది 14 స్కూళ్లలో అందుబాటులోకి తెచ్చారు. అయితే లెక్చరర్ల నియామకం, ప్రయోగశాలలు, మౌళిక సదుపాయాల ఏర్పాటును పట్టించుకోలేదు. సరైన తరగతి గదులు లేవు. హైస్కూల్ ఉపాధ్యాయులతోనే ఆయా సబ్జెక్టుల్లో పీజీ చేసిన వారితో ఈ విద్యార్థులకు పాఠాలు చెప్పిస్తున్నారు. ఆ ఉపాధ్యాయులు వారి రెగ్యులర్ తరగతులు చూసుకొని ఇంటర్ విద్యార్థులకు చెప్పాల్సి వస్తోంది. కొన్ని స్కూల్స్‌లో పరీక్షలు దగ్గరకు వచ్చినా కోర్సులో ఏ పుస్తకాలు ఉంటాయి, వాటిలో ఏమి పాఠాలు ఉంటాయనేవి కూడా చాలా మంది విద్యార్థులకు అవగాహన లేకుండా ఉంటుందంటే హైస్కూల్ ప్లస్ విద్యార్థుల దుస్థితి ఏమిటో అర్థం చేసుకోవచ్చు.

8 పాఠశాలల్లో పాస్ జీరో

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలో ప్రథమ సంవత్సరానికి చెందిన హైస్కూలు ప్లస్ విద్యార్థులు 300 మంది పరీక్షలకు హాజరైతే వారిలో 81 మంది అంటే 27.5 శాతం మంది మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. 219 మంది విద్యార్థులు ప్రథమ సంవత్సరంలో ఫెయిలయ్యారు. ఇక ద్వితీయ సంవత్సరంలో జిల్లా వ్యాప్తంగా 224 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైతే వారిలో 112 మంది అంటే 50 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. సబ్జెక్టుల వారీగా విద్యాబోధన చేసే అధ్యాపకులు లేకపోవడం, మొక్కుబడిగా పాఠశాల ఉపాధ్యాయులతోనే క్లాస్‌లు నడిపించడం అధ్వాన ఫలితాలకు కారణంగా భావిస్తున్నారు.అంతర్వేదిపాలెం, కందికుప్ప, ర్యాలి, పి.గన్నవరం, ఐ.పోలవరం, గొల్లవిల్లి, ముంగండ, జి.వేమవరం పాఠశాలల్లో ప్రథమ సంవత్సరం ఇంటర్మీడియట్‌లో సున్నా ఫలితాలు నమోదయ్యాయి. ద్వితీయ సంవత్సరం అంతర్వేదిపాలెంలో సున్నా ఫలితాలు వెలువడ్డాయి.

స్కూలా.. కాలేజీనా?

ఒకటి నుంచి ఐదు వరకూ ప్రాథమిక పాఠశాలలో విద్యాభ్యాసం జరుగుతుంది. వాళ్లు ఆరు నుంచి ఉన్నత పాఠశాల (హైస్కూల్)కి వెళతారు. దీంతో హైస్కూల్ విద్యార్థులమనే ఒక రకమైన ఆనంద భావనతో పిల్లలుంటారు. తర్వాత ఇంటర్మీడియట్ కోసం కళాశాల(జూనియర్ కాలేజీ)లో చేరతారు. అప్పటి వరకూ స్కూల్ పిల్లలమనే భావన నుంచి కాలేజీకొచ్చామంటూ కొత్త ప్రపంచంలోకి అడుగుపెట్టినట్టు ఫీలవుతారు.అక్కడ మాస్టారు.. ఇక్కడ లెక్చరర్‌గా విద్యను బోధిస్తారు. ఇదంతా పిల్లల మానసిక పరిపక్వత, ఆలోచన సామర్థ్యం, సృజనాత్మకత పెంపుదలకు దోహదపడుతుందని విద్యానిపుణులు చెబుతున్నారు. కానీ హైస్కూల్ ప్లస్ పేరుతో పిల్లలను అక్కడే ఉంచేసి వాళ్లలో గందగోళాన్ని నింపారు.ఆ ప్రభావం చదువుపై పడే అవకాశం లేకపోలేదని మానసిక వైద్య నిపుణులు డాక్టర్ కార్తీక్ విశ్లేషించారు.కనీసం జూనియర్ కళాశాలల మాదిరిగా లెక్చరర్లు, మౌలిక సదుపాయాలు, ప్రయోగశాలలను అందుబాటులోకి తెస్తే పరిస్థితి మారవచ్చు.

ఈ ఏడాది ఫలితాలివీ

తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి ఈ ఏడాది ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల్లో హైస్కూల్ ప్లస్ పాఠశాలలు కొన్ని చాలా దారుణమైన ఫలితాలను నమోదు చేశాయి. ఐదు పాఠశాలల్లో మొదటి ఏడాది, ఒక పాఠశాలలో రెండో ఏడాది ఒక్కరూ పాస్ కాలేదు. మొదటి ఏడాది రోల్ 483 ఉంటే 454 మంది పరీక్షలకు హాజరయ్యారు. దీంట్లో కేవలం 182 మంది మాత్రమే గట్టెక్కారు. రెండో ఏడాది 283కి 269 మంది పరీక్షలు రాయగా 160 మంది ఉత్తీర్ణత సాధించారు. అయితే గతేడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది ఉత్తీర్ణత కాస్త మెరుగుపడడం గమనార్హం.

కోనసీమ జిల్లాలో ఫలితాలు ఇలా..

హైస్కూల్ ప్లస్ కేంద్రం	ప్రథమ హాజరు	ఉత్తీర్ణత	ద్వితీయ హాజరు	ఉత్తీర్ణత
1.అంతర్వేదిపాలెం	1	0	5	0
2.చప్పిడివారిపాలెం	4	2	5	3
3.గోపాలపురం	5	3	3	3
4.అంగర	11	5	0	0
5.సూర్యనగర్	13	1	0	0
6.ముమ్మిడివరం	0	0	12	6
7.రామేశ్వరం	19	3	0	0
8.కాట్రేనికోన	8	1	15	5
9.ఏడిద	23	14	15	7
10.కందికుప్ప	14	0	0	0
11.కడలి	11	7	14	9
12.దంగేరు	16	5	7	4
13.మొగలికుదురు	6	2	9	3
14.బట్టేలంక	25	5	9	3
15.ర్యాలి	3	0	8	3
16.ద్రాక్షారామ	23	7	9	6
17.పి.గన్నవరం	14	0	0	0
18.ఐ.పోలవరం	6	0	0	0
19.ఆలమూరు	10	1	8	5
20.మాచర	9	6	4	4
21.అల్లవరం	7	3	23	13
22.అంబాజీపేట	22	7	22	14
23.కాట్రేనికోన	8	1	15	5
24.గొల్లవిల్లి	2	0	5	1
25.ముంగండ	4	0	15	5
26.జి.వేమవరం	3	0	4	2
27.నేదునూరు	14	5	15	11
28.రామేశ్వరం	19	3	0	0
	300	81	224	112

దేవీపట్నంలో హాజరు 41.. పాస్ జీరో!

(రంపచోడవరం/రాజవొమ్మంగి-ఆంధ్రజ్యోతి) : అల్లూరి జిల్లా రంపచోడవరం మన్యంలో మూడు చోట్ల ఉన్నత పాఠశాలల్లో ప్లస్ టు జూనియర్ కళాశాలలు నడుస్తున్నాయి. రాజవొమ్మంగి జిల్లా పరిషత్ జూనియర్ కళాశాల, అడ్డతీగల జిల్లా పరిషత్ జూనియర్ కళాశాల, దామనపల్లి గిరిజన సంక్షేమ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ప్లస్ టు కళాశాలలకు సంబంధించి ప్రథమ సంవత్సరంలో అడ్డతీగల, దేవీపట్నంలో జీరో ఫలితాలు వచ్చాయి. దేవీపట్నంలో మొదటి ఏడాదిలో 41 మంది పరీక్షలు రాయగా ఒక్కరూ పాస్ కాలేదు. రాజవొమ్మంగిలో గత రెండేళ్ల నుంచి మొదటి సంవత్సరంలో ఏ ఒక్కరూ పాస్ కాకపోగా, ఈ ఏడాది ముగ్గురు విద్యార్థులు మాత్రమే పాసయ్యారు.



పుచ్చిన వంకాయలు.. ఎక్స్‌పైరీ దాటిన రాగి పిండి

నిల్వ సరుకులతో.. వంటకు యత్నం



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు, డీసీవో శైలజ

- ముమ్మిడివరం మండలం రాణేలంక సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో ఘటన
- అడ్డుకున్న పేరెంట్స్ కమిటీ సభ్యులు
- ఫుడ్ కమిషన్ సభ్యుడికి ఫిర్యాదు
- అధికారుల తనిఖీ
- పుచ్చిన కూరగాయలు, ఎక్స్‌పైరీ తేదీ ముగిసిన పిండి ప్యాకెట్లు చూసి అవాక్కయిన వైనం
- వెంటనే సీజ్
- సరుకుల సరఫరాదారుడికి నోటీసులు

ముమ్మిడివరం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం మండల రాణేలంక సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో నిల్వ సరుకులతో వంటకు యత్నించగా పేరెంట్స్ కమిటీ సభ్యులు అడ్డుకున్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ టి.గంగాభవానీ పర్యవేక్షణా లోపం కారణంగా పాఠశాల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందని వారు ఆరోపించారు. ఈ విషయంపై రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు జక్కంపూడి కిరణ్‌కు ఫిర్యాదు చేయడంతో మంగళవారం రాత్రి ఆయన గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంటశాలను పరిశీలించి పారవేసిన పుచ్చిన వంకాయలు, బెండ, ఆనబకాయలను గుర్తించారు.

అధికారుల పరిశీలన

ఈ వ్యవహారంపై ఫుడ్ ఇన్‌స్పెక్టర్ సుబ్బారావుకు, డీసీవో శైలజకు ఫిర్యాదు అందడం, ఫుడ్ కమిషన్ నుంచి గురుకుల పాఠశాల విద్యార్థినులకు నాణ్యతలేని ఆహారం అందిస్తున్నారని ఫిర్యాదు అందడంతో అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ అధికారి బి.శ్రీనివాస్ వారిని పరిశీలించాల్సిందిగా ఆదేశించారు. దీంతో బుధవారం వసతిగృహాన్ని, వంటగది, స్టోర్ రూములను వారు పరిశీలించి అక్కడ ఉన్న సరుకుల నాణ్యతను తనిఖీ చేశారు. నిల్వ రాగిపిండి ప్యాకెట్లను గుర్తించి వాటిని సీజ్ చేశారు. ఉప్మాకు ఉపయోగించే రవ్వ పురుగుపట్టి ఉండడం, బొబ్బర్లు కూడా పుచ్చిపోయి ఉండడాన్ని గుర్తించి స్టోర్ రూము నుంచి వాటిని తొలగింపచేశారు. కూరగాయలు, పండ్లు, సరుకులు తీసుకునేటప్పుడు, వాటిని నిల్వచేసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

అధికారుల పరిశీలన

ఈసందర్భంగా అధికారులు మీడియాతో మాట్లాడుతూ దీనిపై నివేదికను జేసీకి, సోషల్ వెల్ఫేర్ డిపార్టుమెంట్‌కు, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్‌కు అందజేస్తామన్నారు. గడువు ముగిసిన రాగిపిండి ప్యాకెట్లను సీజ్ చేసి చర్యలకు జేసీకి నివేదిస్తామన్నారు. మొదటి హెచ్చరిక కింద సరుకులు సరఫరాదారుకు నోటీసులు ఇచ్చామని, పునరావృతమైతే చర్యలు తప్పవని హెచ్చరించారు. నాణ్యతలేని సరుకులు సరఫరా చేస్తే టెండర్లు రద్దు చేస్తామన్నారు. డీసీవో శైలజ, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు, హెల్త్‌ఆఫీసర్ రవికుమార్, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ టి.గంగాభవానీ, పేరెంట్స్ కమిటీ సభ్యుడు, మెస్ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, వంట తయారుచేసే సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసిఆహార పదార్థాలతయారీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నాణ్యతా ప్రమాణాలపై సూచనలిచ్చారు. దీనిపై ప్రిన్సిపాల్‌కు, ఆహార పదార్థాలు సరఫరా చేసేవారికి నోటీసులు ఇచ్చామని, ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు.

జిల్లా ప్రజారవాణాధికారిగా రాఘవకుమార్



అమలాపురం రూరల్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఏపీఎస్ ఆర్టీసీ జిల్లా ప్రజారవాణాధికారిగా ఎస్టీపీ రాఘవకుమార్ బుధవారం అమలాపురంలోని కార్యాలయంలో పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు కాకినాడ జిల్లా డీపీటీవో ఎం.శ్రీనివాసరావు కోనసీమ జిల్లా ఇన్‌చార్జిగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఏపీఎస్ ఆర్టీసీ ప్రధాన కార్యాలయం విజయవాడలో సీసీవోఎస్‌గా విధులు నిర్వహిస్తున్న రాఘవకుమార్‌ను కోనసీమ జిల్లా ప్రజారవాణాధికారిగా పదోన్నతి కల్పించి బదిలీ చేశారు. శ్రీనివాసరావునుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం గ్యారేజ్ ఆవరణలో రాఘవకుమార్ మొక్కలు నాటారు. సిబ్బంది ఇష్టపడి పనిచేస్తే ఫలితాలు అద్భుతంగా ఉంటాయన్నారు. డీపీటీవోగా పనిచేసిన శ్రీనివాసరావు మాట్లాడుతూ అమలాపురం డిపో అన్ని పారామీటర్లలో అభివృద్ధి పథంలో ఉందని అదే స్ఫూర్తి మున్ముందు కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో అమలాపురం ఆర్టీసీ డీఎం చల్లా సత్యనారాయణమూర్తితోపాటు వివిధ డిపోల మేనేజర్లు, సూపర్‌వైజర్లు సిబ్బంది పాల్గొన్నారు.

23వరకు విద్యార్థుల పరిచయ కార్యక్రమం

- జిల్లా విద్యాశాఖాధికారి

అమలాపురం రూరల్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): 9వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులందరినీ పదో తరగతిలోకి జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా సాదరంగా ఆహ్వానం పలికారు. ఇందుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి పూర్తిచేసుకుని పదో తరగతిలో చేరుతున్న విద్యార్థుల పరిచయ కార్యక్రమంలో బుధవారం డీఈవో పాల్గొన్నారు. ఈనెల 16 నుంచి 23 వరకు ఉన్నత పాఠశాలల్లో పరిచయ కార్యక్రమం అనంతరం విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామన్నారు. పదోతరగతి పాఠశాల విద్యలో ఎంతో కీలకమన్నారు. ఉన్నత చదువులు చదివేందుకు పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించడంద్వారామార్గం సుగమం అవుతుందన్నారు. ప్రతిరోజూ చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. టెన్త్‌లో మంచి ఫలితాలు సాధించేందుకు ఇప్పటినుంచే ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సహకరించాలని డీఈవో కోరారు.

స్వయం ఉపాధి అవకాశాలను ప్రోత్సహించేందుకు.. నేడు రామచంద్రపురంలో ప్రాజెక్టుల ప్రదర్శన: డీఈవో



ప్రదర్శనకు సిద్ధం చేసిన ప్రాజెక్టుతో విద్యార్థులు

అమలాపురం టౌన్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): స్వయం ఉపాధి అవకాశాలను గుర్తించి ప్రోత్సహించేందుకు సమగ్రశిక్ష, పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో చర్యలు చేపట్టినట్టు జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా తెలిపారు. జిల్లాస్థాయినుంచి విద్యార్థులు పారిశ్రామికవేత్తలుగా, వ్యాపారాత్మక ఆలోచనల అభివృద్ధికి ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయనున్నట్టు ఆయన వివరించారు. వ్యాపార ఆలోచనలతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ముందడుగు వేయాలని బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న తొమ్మిదో తరగతి విద్యార్థులను భవిష్యత్తు వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఐదు దశల్లో ప్రాజెక్టుల రూపకల్పనను అమలు చేస్తున్నామన్నారు. జిల్లాలోని ఎంపికైన 42 పాఠశాలల విద్యార్థులు స్వయంగా రూపొందించిన వ్యాపార ప్రాజెక్టులను ఆన్‌లైన్ ద్వారా జిల్లా కార్యాలయానికి పంపించారన్నారు. విద్యార్థుల సొంత ఆలోచనలను, ఆవిష్కరణలు, మార్కెట్ అవసరాలు, పెట్టుబడి వివరాలు వంటి అంశాలను సమన్వయ పరిచి ప్రణాళికలు రూపొందించడం విద్యార్థుల ప్రతిభకు నిదర్శనమన్నారు. వీరి ప్రతిభను మరింత ప్రోత్సహించేందుకు ఉత్తమంగా ఎంపిక చేసిన జిల్లాలోని పది ప్రాజెక్టులను ఈ నెల 17న రామచంద్రపురంలోని శ్రీకృతివంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ జాతీయ ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయి ప్రదర్శనలో ఉంచనున్నట్టు డీఈవో తెలిపారు. కార్యక్రమానికి సంబంధించిన మరింత సమాచారం కోసం జిల్లా సైన్స్ అధికారి గిరజాల వెంకటసుబ్రహ్మణ్యం 9640 188525 నెంబరును సంప్రదించాలన్నారు.

సాగునీటి ఎద్దడి సమస్యలను పూర్తిగా అధిగమించాలి: కలెక్టర్



అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో చిట్టచివరి ఆయకట్టు వరకు పంటలకు పూర్తిస్థాయిలో సాగునీరు సరఫరా చేసేందుకు అధికారులు పూర్తి సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ సూచించారు. జిల్లాలో ఎక్కడా సాగునీటి ఎద్దడి సమస్యలు ఉత్పన్నం కాకుండా ప్రణాళికాబద్ధంగా పనిచేయాలన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం జలవనరులు, రెవెన్యూ, వ్యవసాయ అధికారులతో సమావేశం నిర్వహించి రబీ సాగులో నీటి ఎద్దడి సమస్యలపై సమీక్షించారు. ఉప్పలగుప్తం, కాట్రేనికోన, ఐ.పోలవరం, రాజోలు, అల్లవరం మండలాల్లోని కొన్ని గ్రామాల్లో ఖరీఫ్ వరినాట్లు ఆలస్యంగా వేయడంవల్ల, అకాలవర్షాల మూలంగా సాగు ఆలస్యమైందన్నారు. ఈనేపథ్యంలో ఈనెల 25 వరకు సాగునీరు అందించాల్సి ఉంటుందని క్షేత్రస్థాయి అధికారులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలాలవారీగా పంటల సాగుకు సంబంధించిన కారణాలతో నివేదిక రూపొందించిన అనంతరం నీటి లభ్యతపై జలవనరులశాఖ ఉన్నతాధికారులకు వివరించి సాగునీటి ఎద్దడిని అధిగమిస్తామన్నారు. సాగునీటి సరఫరాపై ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. రెవెన్యూ, ఇరిగేషన్, వ్యవసాయశాఖల అధికారులు సమన్వయం చేసుకుంటూ వారాబందీ పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఇరిగేషన్ అధికారులు క్షేత్రస్థాయిలో ఉండి సాగునీరు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుత రబీ పంటకు మరో 15 రోజులు సాగునీరు అందించేలా ప్రణాళికాబద్ధంగా ముందుకుసాగాలన్నారు. వేసవి సీజన్‌లో నీటిపారుదల వ్యవస్థలు మెరుగు పరిచేందుకు జలవనరులశాఖ ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆర్డీవో కె.మాధవి, జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు, జలవనరులశాఖ కార్యనిర్వాహక ఇంజనీర్ బి.శ్రీనివాసరావు, ఎస్‌డీసీ కృష్ణమూర్తి, వ్యవసాయశాఖ ఏడీ షంషీ, ఇంజనీర్లు పాల్గొన్నారు.

మే 10న జాతీయ లోక్‌అదాలత్

- అమలాపురం రెండో అదనపు జిల్లా జడ్జి, చైర్మన్ వి.నరేష్

అమలాపురం టౌన్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మే 10న మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో నేషనల్ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్టు అమలాపురం రెండో అదనపు జిల్లా జడ్జి, చైర్మన్ వి.నరేష్ తెలిపారు. జాతీయ లోక్‌అదాలత్‌లో వివిధ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న సివిల్, బ్యాంకు, చెక్ బౌన్స్ కేసులతోపాటు రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు పరిష్కరిస్తారన్నారు. కక్షిదారులు అధికసంఖ్యలో పాల్గొని తమ కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. మే 10న ఉదయం 10.30 గంటల నుంచి జరిగే లోక్‌అదాలత్‌లో న్యాయవాదులు, పోలీసు అధికారులు, బ్యాంకు, రెవెన్యూ అధికారులు పాల్గొని ఎక్కువ కేసులు పరిష్కరించేందుకు సహకరించాలని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ నరేష్ కోరారు.

వివాహ వేడుకకు వెళ్లి వస్తుండగా విషాదం



- బైకును లారీ ఢీకొనడంతో యువకుడి మృతి
- మరో యువకుడికి గాయాలు
- న్యాయం చేయాలంటూ మృతుడి కుటుంబీకుల ఆందోళన



వెంకటనగరం వద్ద మృతిచెందిన వీరబాబు (ఫైల్‌ఫొటో)

ప్రత్తిపాడు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం వెంకటనగరం వద్ద బుధవారం సాయంత్రం బోర్‌వెల్ లారీ మోటార్‌బైక్‌ను ఢీ కొన్న ఘటనలో యువకుడు మృతిచెందగా మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు అందించిన మేరకు... ప్రత్తిపాడు మండలంలోని చింతలూరు గ్రామానికి నందవరపు వీరబాబు(20), నందవరపు కృష్ణలు బుధవారం మోటార్ బైక్‌పై శంఖవరం మండలం కొత్తూరు గ్రామం వెళ్లారు. అక్కడ వివాహ వేడుకలో పాల్గొని సాయంత్రం 3.30గంటల సమయంలో స్వగ్రామం చింతూరుకు బైక్‌పై బయల్దేరారు. వెంకటనగరం గ్రామ సమీపంలోని చెరువు వద్ద కోళ్లఫారం వద్దకు చేరుకోగానే ఎదురుగా చింతలూరు నుంచి కత్తిపూడి వైపు వెళ్తున్న బోర్‌వెల్స్ లారీ ఢీ కొంది. ఈ ఘటనలో వీరబాబు తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్ర గాయాలపాలైన కృష్ణను అంబులెన్స్‌లో ప్రత్తిపాడు ఆసుపత్రికి తరలించారు. వీరబాబు చింతలూరు గ్రామానికి నందవరపు రాము దంపతుల రెండో కుమారుడు. వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ కుటుంబానికి చేదోడువాదోడుగా ఉంటున్నాడు. పెదనాన్న నందవరపు భైరాగి కుమారుడైన కృష్ణతో మోటార్‌బైక్‌పై కొత్తూరుకు వెళ్లి తిరిగి వస్తూ రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడడంతో చింతలూరులో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. అందివచ్చిన కొడుకు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో ఆ కుటుంబం కన్నీరుమున్నీరయ్యారు. మృతుల కుటుంబీకులు, గ్రామస్థులు ఘటనా స్థలానికి చేరుకుని రోడ్డుపై బైఠాయించి ఆందోళన నిర్వహించారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

కడుపునొప్పని వెళ్తే ప్రాణంపోయింది!

వ్యక్తి మృతిపై బంధువుల ఆందోళన

వైద్యులు, సిబ్బందే కారణమని యానాం ప్రభుత్వాసుపత్రి వద్ద బైఠాయింపు



యానాంలో ఆసుపత్రి వద్ద ఆందోళన చేస్తున్న బంధువులు



మరణించిన శ్రీనివాస్ (ఫైల్)



శ్రీనివాస్ కొడుకు, కుమార్తె

యానాం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): యానాం నియోజకవర్గంలో అయ్యన్ననగర్‌కు చెందిన పొన్నాడ శ్రీనివాస్ (32) మృతికి యానాం ప్రభుత్వాసుపత్రి వైద్యులు, సిబ్బందే కారణమని బంధువులు ఆందోళనకు దిగారు. మంగళవారం రాత్రి శ్రీనివాస్‌కు కడుపునొప్పి రావడంతో యానాం ప్రభుత్వాసుపత్రికి వచ్చాడు. వైద్యులు పరీక్షించి మందులు ఇవ్వడంతో ఇంటికి వెళ్లిపోయాడు. అనంతరం అర్ధరాత్రి నొప్పి తీవ్రంగా రావడంతో ఆసుపత్రికి రాగా మళ్లీ చికిత్స అందించారు. అనంతరం కాకినాడకు రిఫర్ చేయాలని వైద్యులు సూచించినా అంబులెన్సు సిబ్బంది సరైన సమయానికి అంబులెన్స్ రాకపోవడం, రోగి కూడా నర్సుకుడా రాకపోవడం తదితర కారణాలతో శ్రీనివాస్ మార్గమధ్యలో మృతిచెందినట్టు బంధువులు ఆరోపించారు. అనంతరం మృతదేహాన్ని కాకినాడ ప్రభుత్వాసుపత్రి మార్చురీలో ఉంచారు. శ్రీనివాస్ మృతికి యానాం ఆసుపత్రి సిబ్బందే కారణమని శ్రీనివాస్ కుమార్తె జోశ్న (5), కుమారుడు వీరాట్ (3)తో కలిసి బంధువులు ఆసుపత్రి వద్ద బైఠాయించారు. తమ కుటుంబానికి న్యాయం చేయాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీంతో మత్స్యకార సంఘ నాయకులు మల్లాడి శామ్యూల్, శేరు కృష్ణా తదితరులు ఆసుపత్రి వద్దకు వచ్చి ఆందోళనకారులు, ఆసుపత్రి డీడీతో మాట్లాడారు. త్రిమెన్ కమిటీ వేసి విచారణ నిర్వహించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని డీడీ తెలపడంతో ఆందోళన విరమించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. శ్రీనివాస్ మృతిపై అతడి భార్య శివగంగ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

అంబేడ్కర్ విగ్రహానికి చెప్పుల దండ ఘటనలో...

నిందితుడి అరెస్టు

అన్నవరం/శంఖవరం ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా శంఖవరంలో అంబేడ్కర్ విగ్రహానికి చెప్పులదండ వేసిన ఘటనలో నిందితుడిని అరెస్టు చేసినట్టు అన్నవరం ఎస్ఐ హరిబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాలతో నలుగురు సీఐలు, 10మంది ఎస్ఐలు, 40మంది సిబ్బంది కేసును చేధించేందుకు టీంగా ఏర్పడ్డారు. నిందితుడైన శంఖవరానికి చెందిన పడాల వాసు (20)ను అరెస్టు చేశారు. వాసు దుందుడుకు స్వభావం కలవాడు. కొద్దిరోజులక్రితం ఎస్సీకాలనీలో కొంతమందితో తోపులాటలు జరగగా పెద్దలు రాజీకుదిర్చారు. అది వాసుకు నచ్చకపోవడంతో అంబేడ్కర్ జయంతిరోజున వివాదం సృష్టించాలని ప్రయత్నించి పోలీస్ బందోబస్తు అధికంగా ఉండడంతో వీలుపడలేదని, అర్ధరాత్రి దాటిన తరువాత పథకం ప్రకారం పాతరబ్బరు చెప్పు, ఇంట్లో ఉన్న తాడుతో దండగా కట్టి విగ్రహంపై వేశాడు అని ఎస్ఐ పేర్కొన్నారు. దీనిపై మరింత లోతుగా విచారణ జరుపుతున్నామని చెప్పారు.

డిగ్రీ విద్యార్థి ఆత్మహత్యాయత్నం

తుని రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యనభ్యసిస్తున్న యువకుడు బుధవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అనకాపల్లి జిల్లా పెంటకోట గ్రామానికి చెందిన కర్రి లక్ష్మణ్ తుని డిగ్రీ కళాశాలలో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. కళాశాల బయట పురుగుల మందు తాగడం గమనించిన తోటి విద్యార్థులు ఏరియా ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు ఏరియా ఆసుపత్రికి చేరుకుని ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలుసుకునే ప్రయత్నం చేసినట్టు ఎస్ఐ కృష్ణమాచార్యులు తెలిపారు. సకాలంలో ఆసుపత్రికి తరలించడంతో విద్యార్థి కోలుకుంటున్నట్టు వైద్యులు తెలిపారు.



చికిత్స పొందుతున్న లక్ష్మణ్

భూగర్భ జలాలు పెంచే యజ్ఞం!



- నీటి కుంటల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు
- ఉపాధి హామీ పథకం ద్వారా నిధులు
- జూన్ నెలాఖరు నాటికి పూర్తిచేయడమే లక్ష్యం

కోటనందూరు మండలం ఎస్ఆర్‌పేటలో నీటికుంట ఏర్పాటు చేస్తున్న దృశ్యం(ఫైల్)

కోటనందూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): భూగర్భ జలాల పెంపుతో సాగు, తాగునీటి సమస్యను తీర్చే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం యజ్ఞంలా ఫారం పాండ్స్ (నీటి కుంటలు) ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. భూమిలో తేమశాతం సంరక్షించాలన్నే లక్ష్యంతో తవ్వకాలు చేపట్టింది. ప్రతి పంచాయతీలో పదికి తగ్గకుండా వీటిని ఏర్పాటు చేస్తున్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా ఉండడంతో వీటికి నిధులు విడుదల చేయడం తో పాటు పనులు వేగవంతంగా జరగాలని ఆదేశాలు ఇచ్చారు. ఇటీవల ఆయన ప్రారంభోత్సవ కార్యక్రమం కూడా చేపట్టారు. దీంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో నీటికుంటల పనులు ఊపందుకున్నాయి. రాష్ట్రంలో లక్షా 55 వేలు నీటి కుంటల ఏర్పాటు లక్ష్యంగా నిర్ణయించారు. అలాగే జిల్లాలో కూడా వీటి ఏర్పాటుకు ఒక నిర్దిష్టం సంఖ్య ఏర్పాటు చేసి ఉపాధి నిధులతో పనులు చేపడుతున్నారు. జూన్ నెలాఖరు నాటికి పనులు పూర్తిచేయాలని ఆదేశాలు ఉండడంతో అందుకనుగుణంగా పనులు జరుగుతున్నాయి.

ఉపయోగాలివే...

రైతుల పొలంలో నీటికుంటలు తవ్వకాలు చేయడం వల్ల భూగర్భ జలాలు పెంచడంతో పాటు, భూమిలో తేమ శాతం, పశువులకు తాగు నీరు, పంటలకు పురుగు మందుల పిచికారీకి నీరు, అందుబాటులో ఉంటుంది. బోరు బావి దగ్గర్లో ఏర్పాటు చేస్తే నీటి శాతం పెరుగుతోంది. దీంతో రైతులను చైతన్యపరిచి నీటికుంటలు ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపడుతున్నా రు. నీటకుంటలు సైజు ఆధారంగా రేట్లు ఉంటా యి. తక్కువ ఖర్చుతో ప్రయోజనకరంగా ఉండేందుకు వీలుగా పొలాల్లో 8 మీటర్లు వెడల్పు, 8మీటర్లు పొడవుకు 2మీటర్లు లోతుకు 128 చదరపు మీటర్లు నీటికుంటకు రూ.38,400 ఉపాధి నిధులను ఖర్చు అవతుంది. అలాగే పలు రకాలుగా పొడవు, వెడల్పుతో నీటికుంటలు ఏర్పాటు చేస్తున్నారు.

అన్నదాతలకు అవగాహన

నీటి కుంటల ఏర్పాటుపై అన్నదాతలకు అధికారులకు అవగాహన కల్పించి తద్వారా ఏర్పాటుకు ముమ్మరంగా పనిచేస్తున్నారు. గత ప్రభుత్వం వైసీపీ వీటిని నిర్లక్ష్యం చేయగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నీటి కుంటల ఏర్పాట్లు ముందుకు సాగుతున్నాయి. సాగునీటి వనరులు పెంచే లక్ష్యంతో అధికారులు అడుగులువేస్తున్నారు. దీనిలో భాగంగా కాకినాడ జిల్లాలో 2500 నీటి కుంటల ఏర్పాటు లక్ష్యం కాగా అందులో రూ.25 కోట్లతో పనులు చేపడుతున్నారు. అలాగే తూర్పు గోదావరి జిల్లాలో 1500 నీటికుంటల ఏర్పాటు లక్ష్యం కాగా... రూ.4.50కోట్లు నిధులు ఇచ్చారు. ఇప్పటి వరకూ 1166 గుర్తించగా అందులో 138 పూర్తిచేశారు. ఒక్కోటి అంచనా వ్యయం రూ.25 వేల నుంచి 35వేలు అని చెప్పవచ్చు. అనుకున్న లక్ష్యం ప్రకారం మొత్తం జూన్ నెలఖారు నాటికి నీటి కుంటలు పూర్తి చేసేలా పనులు జరుగుతున్నాయి.

రైతులు ఉపయోగించుకోవాలి

నీటికుంటల ఏర్పాటుకు ప్రాధాన్యమిస్తున్నాం. కాకినాడ జిల్లాలో 2500 నీటికుంటలు ఏర్పాటుచేసి జూన్ నెలాఖరు నాటికి పూర్తి చేసి రైతులకు ప్రయోజనకరంగా ఉండేలా చేస్తున్నామన్నారు. ప్రతి రైతు ఉపయోగించుకోవాలి.

-అడపా వెంకటలక్ష్మి, పీడీ, ఉపాధి హామీ పథకం, కాకినాడ

రెండో రోజూ...

- కాకినాడలో కొనసాగిన ఏపీఎస్పీ రేంజ్ 1 క్రీడాపోటీలు
- నేడు ముగింపు కార్యక్రమం
- అతిథులుగా బెటాలియన్స్ ఐజీపీ రాజకుమారి, డీఐజీ ఫకీరప్ప



పరుగు పందెం



కబడ్డీ పోటీ



హైజంప్

కాకినాడ రూరల్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేట గ్రా మ పంచాయితీ పరిధిలోని ఏపీఎస్పీ 3వ బెటాలియన్ మైదానంలో నిర్వహిస్తున్న ఏపీఎస్పీ రేంజ్ 1 గేమ్స్, క్రీడాపోటీలు రెండో రోజు బుధవారం కొనసాగాయి. ఏపీఎస్పీ 3వ బెటాలియన్ కమాండెంట్ ఎం.నాగేంద్రరావు క్రీడా పోటీలను పరిశీలించారు. 3రోజుల పాటు జరిగే పోటీల్లో కాకినాడ 3వ బెటాలియన్‌తో పాటూ విజయనగరం నుంచి 5వ బెటాలియన్, మంగళగిరి నుంచి 6 బెటాలియన్, విశాఖపట్నం నుంచి 16 బెటాలియన్‌కు చెందిన పోలీస్ క్రీడాకారులు చెస్, క్రికెట్, కబడ్డీ, హైజంప్, 1500, 200, 5000 మీటర్లు పరుగు, మారథాన్ వంటి క్రీడల్లో పాల్గొన్నారు. గేమ్స్, క్రీడా పోటీలు గురువారం ముగియనుండగా ఈ కార్యక్రమంలో బెటాలియన్స్ ఐజీపీ బి.రాజకుమారి, డీఐజీ కె.ఫకీరప్ప ముఖ్య, గౌరవ అతిథులుగా పాల్గొంటున్నారని 3వ బెటాలియన్ కమాండెంట్ ఎం.నాగేంద్రరావు తెలిపారు.

విజేతల వివరాలు

క్రీడాపోటీల్లో భాగంగా రెండో రోజు నిర్వహించిన హైజంప్ పోటీలో పి.ప్రసాదరావు, వి.సుధాకర్, జి.శ్రీను ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలుగా నిలిచారు. అదేవిధంగా 1500 మీటర్ల పరుగు పోటీలో ఎస్.సురేష్‌కుమార్, కె.రాజనాయుడు, పి.సత్యారావు మొదటి మూడు స్థానా లు కైవసం చేసుకున్నారు. 200 మీటర్ల పరుగులో ఎస్.సురేష్‌కుమార్, జి.శ్రీను, జి. మురళీ ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలుగాను, 5000 మీటర్ల పరుగులో ఎస్.సురేష్‌కుమార్, వై.సత్యారావు, రాజీనాయుడు మొదటి 3 స్థానాల్లో నిలిచారు. మారథాన్‌లో ఎం.లక్ష్మణ్, టి.శ్రీనివాసరావు మొదటి, రెండు స్థానాల్లో, చదరంగంలో శివకుమార్, శ్రీను మొదటి, రెండు స్థానాలు గెలుపొందగా, కబడ్డీలో 16వ ఏపీఎస్పీ జట్టు విన్నర్‌గానూ, 5వ ఏపీఎస్పీ జట్టు రన్నర్‌గానూ నిలిచాయి. అలాగే క్రికెట్‌లో 3వ బెటాలియన్ ఏపీఎస్పీ జట్టు ప్రథమ, 6వ బెటాలియన్ ఏపీఎస్పీ జట్టు ద్వితీయ విజేతగా నిలిచాయి.

దారిద్ర్యరేఖకు దిగువనున్న ప్రజలకు రూ.5 లక్షల విలువైన వైద్యం

రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరి



కడియపుసావరంలో మాట్లాడుతున్న పురందేశ్వరి

కడియం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న ప్రజలకు రూ.5 లక్షల విలువైన వైద్యం అందించేలా ఆయుష్మాన్‌భవ, ప్రతీ గ్రామానికి సురక్షితమైన తాగునీరు ఇవ్వాలనే ఉద్దేశ్యంతో వాటర్‌ట్యాంకుల ఏర్పాటుతో పాటు ప్రతీ ఇంటికి కుళాయి ద్వారా నీరు అందించే విధంగా జలజీవన్ మిషన్ పథకాలను కేంద్రప్రభుత్వం అమలుచేస్తుందని రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి పేర్కొన్నారు. బుధవారం తూర్పుగోదావరి జిల్లా కడియపుసావరంలో నిర్మించిన సచివాలయం, 2 వాటర్ ట్యాంకులు, పేపరుమిల్లు సమకూర్చిన ట్రాక్టర్‌ను ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరితో కలిసి పురందేశ్వరి ప్రారంభించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ అమరావతి నిర్మాణానికి కేంద్రప్రభుత్వం రూ.11వేల కోట్లు ఇస్తుందన్నారు. అందులో భాగంగానే రూ.4,285 కోట్లు కేంద్రప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వానికి ఇవ్వడం జరిగిందన్నారు. పోలవరం నిర్మాణానికి రూ.12,500 కోట్లు ఇవ్వడానికి కేంద్రం ముందుకొచ్చిందన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆలోచన కాకుండా లాభాల్లోకి తీసుకురావాలనే విషయం మీద దృష్టిపెట్టినట్టు తెలిపారు. ఎమ్మెల్యేలకు వారి పరిధిలో సుమారు 150 నుంచి 200 గ్రామాలు ఉంటాయని, అదే ఎంపీకి వారి పరిధిలో సుమా రు 1000 గ్రామాలు ఉంటాయన్నారు. ఎమ్మెల్యేల సహకారంతో స్థానికంగా సమస్యలు గుర్తిం చాలని ఆ సమస్యలను రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల పరిధిలో ఆయా శాఖల మంత్రులతో చర్చించి పరిష్కరించి అభివృద్ధి చేయడానికి కృషి చేయవచ్చన్నారు. పేపరుమిల్లు ఈడీ ముఖేష్‌జైన్, సీఎస్ బి.విజయ్‌కుమార్ మాట్లాడుతూ రూ. 2,900 కోట్లతో పరిశ్రమను విస్తరిస్తున్నట్టు తెలిపారు. సర్పంచ్ చెక్కపల్లి మురళీకృష్ణ, ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, మార్గాని సత్యనారాయణ, ప్రత్తిపాటి రామారావుచౌదరి, వరగోగుల వెంకటేశ్వరరావు, వెలుగుబంటి నాని, ఆకుల శ్రీధర్, బొర్సు సుబ్రహ్మణ్యం, వరగోగుల సత్యనారాయణ, సీఎస్ఆర్ మేనేజర్ దాసరి తాతారావు పాల్గొన్నారు.

ఇంటర్ ఎలక్ట్రానిక్స్ విభాగంలో స్టేట్ టాపర్‌కి మంత్రి అభినందన



సాయిలక్ష్మి, ఆమె తల్లిదండ్రులకు ల్యాప్ టాప్ అందజేస్తున్న మంత్రి లోకేశ్

కాకినాడ రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ పీఆర్ ప్రభుత్వ వృత్తి విద్యా జూనియర్ కళాశాల విద్యార్థిని డి.సాయిలక్ష్మి ఎలక్ట్రానిక్స్ విభాగంలో 1000కి 982 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. అమరావతిలో జరిగిన షైనింగ్ స్టార్స్-25 కార్యక్రమంలో ఆమెకు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ బంగారు పతకం, ల్యాప్‌టాప్ అందజేశారు. సాయిలక్ష్మి, ఆమె తల్లిదండ్రులను సత్కరించారు. భవిష్యత్తులో ఏమవు దామునుకుంటున్నావని ఆ విద్యార్థినిని లోకేశ్ అడగ్గా డిగ్రీ పూర్తి చేసి గ్రూప్స్ పరీక్షలకు ప్రిపేరవుతానని తెలిపింది. ఆమెను ప్రభుత్వమే ఉచితంగా చదివిస్తుందని ప్రిన్సిపాల్ తిరుపతి రెడ్డి తెలిపారు. సాయిలక్ష్మిని ఇంటర్మీడియట్ బోర్డు కమిషనరు కృతికా శుక్లా, కాకినాడ సిటీ ఎమ్మెల్యే కొండబాబు, కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారులు పీవీ శివప్రసాద్, నిరంజన్‌కుమార్ అభినందించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



సురేష్ (ఫైల్)

పిఠాపురం రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం మండలం మల్లాంలో బుధవారం సాయంత్రం విద్యుదాఘాతానికి గురైన వ్యక్తి మరణించాడు. గ్రామానికి చెందిన పల్లపు సురేష్‌బాబు(37) అదే గ్రామంలో ఓ ఇంటికి ఎలక్ట్రికల్ పనుల నిమిత్తం వెళ్లాడు. మోటార్‌కు కనెక్షన్ ఇస్తుండగా కరెంటు షాక్‌కు గురై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. అతడిని పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తీసుకురాగా అప్పటికే మరణించినట్టు వైద్యులు తెలిపారు. అతడికి భార్య మణి, 10వతరగతి చదువుతున్న కుమారుడు సంజయ్, 8వ తరగతి చదువుతున్న కుమార్తె సరిత ఉన్నారు. విషయం తెలుసుకున్న సురేష్ కుటుంబసభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మృతదేహాన్ని పిఠాపురం మార్చురీలో భద్రపరిచారు.

రోడ్డు ప్రమాదంలో మృతులకు ముగిసిన అంత్యక్రియలు

అమలాపురం రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని జనగామ జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన సత్తి శ్రీను (50), సత్తి రమణకుమారి (45), సత్తి అనూష(22) అక్కడికక్కడే మృతిచెందారు. వారి మృతదేహాలకు జనగామ ఏరియా ఆసుపత్రిలో మంగళవారం పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం బుధవారం ఉదయం వారి మృతదేహాలు స్వగ్రామం కోనసీమ జిల్లా అమలాపురం మండలం సవరప్పాలెం గ్రామానికి చేరుకోగా ఆ వెంటనే బంధువులు, స్నేహితుల సమక్షంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఇదే ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అదే కుటుంబానికి చెందిన సత్తి రాజేశ్వరరావు, అనంతలక్ష్మి, సత్యఅరవింద్‌లు హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో ఇంకా చికిత్స పొందుతున్నారు.

బాలికపై అత్యాచారం

కాకినాడ క్రైం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారం జరిగిన సంఘటన బుధవారం కాకినాడలో జరిగింది. నగరానికి ఓ మహిళ చేపలు వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తుంది. ఆమెకు 16 ఏళ్ల కుమార్తె ఉంది. కాగా ఆమె భర్త కొంత కాలం క్రితం చనిపోవడంతో లోకేశ్ అనే వ్యక్తితో సహజీవనం చేస్తుంది. ఈ క్రమంలో బుధవారం ఆ మహిళ బయటకు వెళ్లింది. ఆమె కుమార్తె ఇంటిలో ఉన్న సమయంలో లోకేశ్ ఇంటిలోకి వెళ్లి నిద్రిస్తున్న ఆ బాలికపై అత్యాచారానికి పాల్పడి పరారయ్యాడు. ఇంటికి వచ్చిన తల్లితో ఆ బాలిక విషయాన్ని చెప్పింది. మహిళ ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి బాలికను వైద్య పరీక్షలు నిమిత్తం జీజీహెచ్‌కు తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

పోక్సో కేసులో నిందితుడికి 14 రోజుల రిమాండ్

రాయవరం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా రాయవరానికి చెందిన బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన నిందితుడు తేతలి శ్రీనివాసరెడ్డిపై రాయవరం పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. బుధవారం శ్రీనివాసరెడ్డిని అనపర్తి జేఎఫ్‌సీఎం ముందు హాజరుపర్చగా 14 రోజులు రిమాండ్ విధించినట్టు ఎస్ఐ డి.సురేష్‌బాబు తెలిపారు.

ఇంటి నుంచే పౌరసేవలు

మన మిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ప్రారంభం



సామర్లకోట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఇంటి వద్ద నుంచే పౌరసేవలు వినియోగించుకునేందుకు కూటమి ప్రభుత్వం ఒకడుగు ముందుకేసింది. ప్రభుత్వం తాజాగా ప్రారంభించనున్న ఇంటి నుంచే పౌరసేవలు పొందేందుకు బయటకు రావాల్సిన అవసరం లేకుండా ఒకే వాట్సాప్ మెసేజ్‌తో పౌరసేవలను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం మనమిత్ర అనే నూతన వాట్సాప్ గవర్నెన్స్ వ్యవస్థను ప్రవేశపెట్టిందని, మరో 2,3 రోజుల్లో వాట్సాప్ గవర్నెన్స్ ప్రారంభం కాగలదని విశ్వసనీయ సమాచారం. ఈ వేదిక ద్వారా ప్రజలు ప్రస్తుత ధృవపత్రాలు, లైసెన్స్‌లు, పన్నుల చెల్లింపులు, బిల్లులు, దేవాలయ దర్శనాలు, పరీక్షల ఫలితాలు, వంటి 250కు పైబడి సేవలను పొందవచ్చని ప్రభుత్వం ప్రకటించింది. జూన్ 12 నాటికి 500 సేవలు, ఏడాది చివరకు వేయి రకాల సేవలు అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందని జిల్లా ఉన్నతాధికారులు చెబుతున్నారు. ప్రజలందరూ వినియోగించుకుని తమకు కావాల్సిన పౌరసేవలను త్వరితగతిన పారదర్శకంగా పొందేలా ప్రభుత్వం నూతనాధ్యాయానికి శ్రీకారం చుట్టనుంది.

ప్రభుత్వాసుపత్రిలో యువకుల హల్‌చల్



రోగులతో మాట్లాడుతున్న యువకులు

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రిలో బుధవారం కొందరు యువకులు హల్‌చల్ చేశారు. ఆసుపత్రిలోని ఇన్‌పేషెంట్ వార్డుల్లో కలియదిరుగుతూ అక్కడి రోగులతో మాట్లాడుతూ వైద్యసేవలపై ఆరా తీశారు. వీడియోలు తీసుకున్నారు. ఆసుపత్రిలో రోగుల పరిస్థితి దారుణంగా ఉందని, పడుకునేందుకు బెడ్స్ లేవని, కరెంట్ లేదని తదితర సమస్యలను ప్రస్తావిస్తూ వీరసింగం అనే యువకుడు ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక వీడియో పోస్టు పెట్టాడు. ఆ పోస్టు బుధవారం కొంత వైరల్ కావడంతో మాజీ ఎంపీ భరత్‌రామ్, కొన్ని మానవహక్కుల సంస్థల ప్రతినిధులు ఆసుపత్రికి వచ్చి పరిశీలించారు. ఇదే సమయంలో వీడియో పోస్టుపెట్టిన వీర సింగం అనే యువకుడు, అతడితోపాటు మరికొందరు యువకులు ఆసుపత్రికి చేరుకున్నారు. వారంతా ఆసుపత్రిలోకి ప్రవేశించి వార్డుల్లో కలియదిరిగారు. రోగులతో మాట్లాడుతూ వైద్యసేవలు ఎలా అందుతున్నాయంటూ ఆరా తీశారు. నర్సింగ్ స్టాఫ్‌ను సైతం ప్రశ్నించడం గమనార్హం. ఒక పక్క మాజీ ఎంపీ భరత్‌రామ్, మరోపక్క ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు పెట్టిన యువకుడు, అతడి వెంట వచ్చిన వారు వార్డుల్లో తిరిగారు. సుమారు 2 గంటలసేపు ఈ తతంగమంతా సాగింది. ఇంత జరుగుతున్నా ఆసుపత్రి అధికారులు, సెక్యూరిటీ సిబ్బంది కానీ స్పందించకుండా చోద్యం చూస్తూ కూర్చున్నారు. ఇన్‌పేషెంట్ రోగులను కలిసేందుకు నిర్ణీత సమయంలోనే అనుమతిస్తామంటూ హుకుం జారీ చేసిన ఆసుపత్రి అధికారులు ఈ విషయంపై నోరుమెదపకపోవడం చర్చనీయాంశంగా మారింది.



కొత్తగా ట్రైన్

సాధారణంగా రైలు పట్టాలపై ట్రైన్ ఇంజన్లు వెళ్తుంటాయి. కానీ ట్రైన్ ఇంజన్ రోడ్డుపై కనిపిస్తే.. అదీ కూడా ట్రాలీ మీద ఉంటే ఎవరిచూపైనా పడాల్సిందే. అటువంటి దృశ్యమే కాకినాడ జిల్లా గండేపల్లిలో కనిపించింది. హైవేపై ట్రాలీ మీద ట్రైన్ ఇంజన్ తీసుకెళ్లడంతో స్థానికులు చూసి కొంచెం కొత్తగా ఉందని ఫొటోలు తీసుకున్నారు.

గండేపల్లి(ఆంధ్రజ్యోతి)

లారీ బోల్తా

మలికిపురం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి):మేడిచర్ల పాలెం కాల్వరేవులో మంగళవారం రాత్రి ఇసుకలోడుతో వెళుతున్న లారీ బోల్తా కొట్టింది. ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. ఇసుకలోడుతో శివకోటి వైపు నుంచి గుడిమెళ్లంకవైపు వస్తున్న లోడు లారీ ఎదురుగా వస్తున్న మరో వాహనాన్ని తప్పించబోయి బోల్తా కొట్టింది.

వేంటేశ్వరస్వామి ఆదాయం రూ.57వేలు

పి.గన్నవరం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): లంకలగన్నవరంలో వేంచేసి ఉన్న శ్రీభూసమేత వెంకటేశ్వరస్వామి ఆలయం హుండీ కానుకలను గ్రామస్తుల సమక్షంలో దేవస్థానం అధికారులు బుధవారం లెక్కించారు. రెండేళ్లకు రూ.57,770 ఆదాయం వచ్చింది. కార్యక్రమంలో అధికారులు, ఆలయ ప్రధాన అర్చకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

దేవస్థానం భూముల సర్వే పది రోజుల్లో పూర్తి

అమలాపురం ఆర్డీవో మాధవి


స్వామివారి ఆలయ భూములపై పలువురు రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో కె.మాధవి

అంతర్వేది, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ఆలయ భూముల శిస్తుపై రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, ఆర్డీవో కె.మాధవి, దేవదాయశాఖ అధికారుల ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అయితే పూర్తిస్థాయిలో రైతులు ముందుకురాకపోవడంతో సమావేశాన్ని వెంటనే వాయిదా వేశారు. పూర్తిస్థాయిలో దేవ స్థానం భూములు సర్వే నిర్వహించిన తరువాత రైతులతో మాట్లాడతామని ఆర్డీవో కె.మాధవి తెలిపారు. తొలుత స్వామివారిని దర్శించుకున్న ఆర్డీవో మాధవి అనంతరం తక్కువ సంఖ్యలో వచ్చిన రైతులతో మాట్లాడారు. లక్ష్మీనరసింహస్వామివారికి 726ఎకరాలు భూములు ఉండగా వాటిలో వరి, సర్వే, చెరువులు, ఇళ్లు ఉన్నప్పటికీ వాటి శిస్తును పెంచేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు ముందుకు వస్తున్నా రైతులు మాత్రం స్పందించడం లేదన్నారు. స్వామివారి భూములపై పది రోజుల్లో పూర్తిస్థాయి సర్వే నిర్వహించి ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ సమక్షంలో రైతులతో మాట్లాడి శిస్తు వసూలు, పెంచే విధానంపై చర్చిస్తామని తెలిపారు. స్వామివారి భూములు అన్యాక్రాంతం, ఆక్రమణలు జరిగిన కొన్నింటిలో చర్చిల నిర్మాణం కూడా జరిగిందని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాసనగేష్ ఆర్డీవో మాధవికి తెలిపారు. దీనిపై ఆర్డీవో స్పందిస్తూ స్వామివారికి ఎక్కడ భూమి ఉన్నా పూర్తిస్థాయిలో సర్వే చేయించి స్వామివారికి చెందేలా ఆక్రమణలకు గురికాకుండా చూస్తామన్నారు. అనంతరం పలువురు రైతులు స్వామివారి భూముల శిస్తుపై ఆర్డీవో మాధవికి వినతిపత్రాలు అందించారు. ఏసీ వి.సత్యనారాయణ, తహశీల్దార్ ఎం.వెంకటేశ్వరరావు, డిప్యూటీ తహశీల్దార్ భాస్కర్, ఆర్ఐ రామరాజు, ఎంపీటీసీ బైరా నాగరాజు, కొల్లాబత్తుల నాని, మాలే శ్రీనివాసనగేష్, పోతురాజు సురేష్, ఉండపల్లి అంజి, తాడి నీలకంఠం, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ శాఖలో సంస్కరణలపై సంబరాలు

- కామనగరువు జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయం వద్ద వేడుకలు
- ఏవోలకు ఏవిధమైన అన్యాయం జరగలేదని వినతిపత్రం అందజేత


కామనగరువు డీపీవో కార్యాలయం వద్ద సమావేశమై వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ అధికారులు

అమలాపురం రూరల్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో రాష్ట్రంలోనే అతిపెద్ద శాఖ అయిన పంచాయతీరాజ్ శాఖలో ఇటీవల చేపట్టిన సంస్కరణలు అభినందనీయమని జిల్లాలోని పంచాయతీ విస్తరణాధికారులు, పంచాయతీ కార్యదర్శుల సంఘం, మినిస్టీరియల్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలుపుతూ సంబరాలు జరుపుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, పంచాయతీరాజ్ కమిషనర్ మైలవరపు కృష్ణతేజ ఆధ్వర్యంలో దశాబ్దాల కాలం అనంతరం సంస్కరణలకు శ్రీకారం చుట్టడం పట్ల బుధవారం కామనగరువులోని జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయం వద్ద సంబరాలు జరుపుకున్నారు. జిల్లా సంఘాల అధ్యక్షులు జి.మల్లికార్జునరావు, రుద్రరాజు ఎస్ఎస్ సూరపరాజుల ఆధ్వర్యంలో తొలుత సమావేశం నిర్వహించారు. జీవోఎంఎస్ నంబరు 35లో భాగంగా పంచాయతీల విస్తరణాధికారి పోస్టును డిప్యూటీ ఎంపీడీవోగా మార్పు చేయడంతో పాటు ఎంపీడీవోల పదోన్నతుల్లో విస్తరణాధికారులకు 60శాతం కోటా కల్పిస్తూ జీవో విడుదల చేయడం పట్ల ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అయితే ఎంపీడీవో పదోన్నతుల్లో ఏవోలకు 34శాతం అవకాశం కల్పించగా వారికి అన్యాయం జరిగిందని అనడం తగదన్నారు. గ్రామ పంచాయతీలో బిల్ కలెక్టర్, జూనియర్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు గ్రేడ్-1 నుంచి గ్రేడ్-6 వరకు, విస్తరణాధికారుల సంఖ్యాబలం ఎక్కువగా ఉండడం వల్లనే 60శాతం వాటా కల్పించడం జరిగిందన్నారు. మండలపరిషత్, జిల్లాపరిషత్‌లలో జూనియర్ అసిస్టెంట్లు, సీనియర్ అసిస్టెంట్లు, టైపిస్ట్, ఏవోల సంఖ్యాబలం తక్కువగా ఉండడం వల్ల 34శాతం వాటా కల్పించారని వివరించారు. ఏవోలకు ఏవిధమైన అన్యాయం జరగలేదని ప్రభుత్వానికి వివరిస్తూ వినతిపత్రం అందజేశారు. జీవో నంబరు 35పట్ల హర్షాతిరేకాలు వ్యక్తంచేస్తూ స్వీట్లు పంచారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘ ప్రతినిధులు యు.నాగేంద్ర, ఎండీ అబ్బాస్, శెట్టిమల్లి రాజమోహన్, దుర్గాశ్రీనివాస్, రెహ్మాన్, రెడ్డిశిరీష, తేజ, కల్యాణ్, వల్లి, అశోక్, రమ్య, మల్లేశ్వరి, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

తెలుగు నాటకానికి ఊపిరి పోద్దాం: శివనాగరాజు

- హైస్కూల్లో ఏక పాత్రాభినయం, పౌరాణిక నాటకాల ప్రదర్శన


భీమనపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏకపాత్రాభినయ ప్రదర్శనలో ఉపాధ్యాయులు

ఉప్పలగుప్తం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): గతంలో విశ్వవ్యాప్తమైన తెలుగు నాటకం ప్రస్తుతం కొన ఊపిరితో ఉందని తెలుగు పండితుడు, నాటక కళాకారుడు పచ్చిమాల శివనాగరాజు ఆవేదన వ్యక్తం చేశారు. వీరేశలింగం జయంతి సందర్భంగా బుధవారం భీమనపల్లి శ్రీమతి శిరంగు రంగనాయకమ్మ జడ్పీ హైస్కూల్లో తెలుగు నాటక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పౌరాణిక నాటకమంటే ఏమిటో తెలియని ఈతరానికి దాని విశిష్టతపై అవగాహన కల్పించవలసిన బాధ్యతను ప్రభుత్వం తీసుకోవాలని కోరారు. ఈసందర్భంగా ఆంగ్ల బోధకుడు రాయి వెంకటేశ్వరరావు అల్లూరి సీతారామరాజు ఏకపాత్రాభినయం అందరినీ ఆకట్టుకుంది. సీతారామరాజుగా ఆయన అభినయంతో ప్రేక్షకులు వందేమాతరం అంటూ నినదించారు. విశ్రాంత ఉపాధ్యాయుడు కడలి త్రిమూర్తులు దుర్యోధనుడిగా ఏకపాత్రాభినయం చేశారు. మయసభ సీన్‌లో ఆయన సంభాషణాచాతుర్యానికి ప్రేక్షకులు కరతాళ ధ్వనులు చేశారు. ఉపాధ్యాయుడు శ్రీకృష్ణరాయబారం నాటకాన్ని ప్రదర్శించారు. శ్రీకృష్ణుడిగా చక్రపాణి, దుర్యోధనుడిగా కడలి త్రిమూర్తులు, అర్జునుడిగా పచ్చిమాల శివనాగరాజు శయనఘట్టంలో పోటాపోటీగా నటించి తెలుగు నాటకం పట్ల ఆసక్తి కల్గించారు. అనంతరం విద్యార్థుల భరతనాట్య ప్రదర్శన జరిగింది. కళాకారుడు, తెలుగు పండితుడు శివనాగరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బెండమూర్లంకకు చెందిన సీనియర్ కళాకారుడు నూకల సత్యనారాయణ దంపతులను హెచ్ఎం నూకల సత్యనారాయణ సన్మానించారు. నాటక ప్రదర్శనలో పాల్గొన్న ఉపాధ్యాయులను పీఎంసీ చైర్మన్ గుర్లింక చిన్నా నూతనవస్త్రాలతో సన్మానించారు. కె.లక్ష్మి, కె.గౌరి, శిరంగు సుబ్బలక్ష్మి, ముత్యాల నరసింహమూర్తి, అరవ నాయుడు, పద్మనాభన్ పాల్గొన్నారు. పౌరాణిక నాటక రూపశిల్పి చిటికెన లక్ష్మణరావు, హార్మోనియం కళాకారుడు శ్రీద్రాక్షారామ శ్రీనివాసరావును సత్కరించారు.

విద్యలో రాణిస్తే ప్రత్యేక గుర్తింపు

మామిడికుదురు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): విద్యలో రాణించడం ద్వారా విద్యార్థులకు ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని ఎంఈవో వి..లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ఐఎన్‌టీఏ స్కోలో ప్రతిభ కనబరిచిన మొగలికుదురు శ్రీ చైతన్యస్కూలు విద్యార్థులకు బహుమతులను ఎంఈవో బుధవారం అందించారు. ల్యాప్‌టాప్ గెలుచుకున్న శ్రీహర్షతో పాటు బంగారు పతకాలు, ప్రశంసా పత్రాలు సాధించిన 356మంది విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ప్రిన్సిపాల్ సుధాలక్ష్మి, డీన్ రమేష్, కోఆర్డినేటర్ శ్రీకాంత్, సి-బ్యాచ్ ఇన్‌చార్జి శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వినాయకుడికి పూజలు

కాట్రేనికోన, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): కాట్రేనికోనగ్రామదేవత మావుళ్ళమ్మ ఆలయ సన్నిధిలో ఉన్న శ్రీసిద్ధివినాయకస్వామికి బుధవారం సంకష్ట చతుర్థి పూజలు నిర్వహించారు. పంచామృతాభిషేకం, గరిక పూజ, అష్టోత్తర పూజలు జరిగాయి. పణికాంత్‌శాస్త్రి ఆధ్వర్యంలో పలువురు భక్తులు ఈపూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆణివిళ్ళ సాయిబాబా, రామకృష్ణపరమహంస, తాతపూడి గోపి, గ్రంధి రామ్‌ప్రసాద్, చెరుకు బాపిరాజు, చెరుకు కృష్ణ, సంసాని పాండురంగారావుతో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పవర్‌లిఫ్టింగ్‌లో ప్రతిభ



అమలాపురం రూరల్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయిలో నిర్వహించిన పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో ఇందుపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటి పతకాలు సాధించారు. బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో 8వ తరగతి విద్యార్థిని బోడపాటి సింధు ద్వితీయస్థానం సాధించి రజత పతకం దక్కించుకుంది. పదో తరగతి విద్యార్థి జల్లి జితేంద్రదొర ద్వితీయస్థానంతో రజత పతకం సాధించాడు. వీరిని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా అభినందించారు. పవర్‌లిఫ్టింగ్‌లో తర్ఫీదు ఇచ్చిన పీఈటీ బుజ్జి, జిమ్ కోచ్ కంకిపాటి వెంకటేశ్వరరావులకు అభినందనలు తెలిపారు.

విద్యార్థుల భవిష్యత్‌కు హరివిల్లు వెబ్ యాప్


హరివిల్లు యాప్ వెబ్ పేజీలను ఆవిష్కరిస్తున్న సాంబశివరావు

అమలాపురం టౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తమ భవిష్యత్తును తామే నిర్మించుకునేలా అవకాశాల హరివిల్లు పేరిట ప్రొఫెషనల్ పాత్ ఫైండర్ యాప్ వెబ్ పేజీలను బుధవారం ఆవిష్కరించారు. అమలాపురం యర్రమిల్లివారివీధిలోని లీడ్‌దిలైఫ్ కార్యాలయంలో 200ప్రొఫెషన్స్‌కు సంబంధించి పూర్తి వివరాలు గల వెబ్‌పేజీల యాప్‌ను కంపెనీ సీఈవో చిక్కం సాంబశివరావు విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలు పూర్తయి ఫలితాలు వెలువడుతున్న నేపథ్యంలో ఏ కోర్సులో చేరాలో తెలియక విద్యార్థులు అయోమయానికి గురవుతున్నారన్నారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ తరువాత ఎటువైపు అనే అంశంపై విద్యార్థులకు ఎంతో ఉపయుక్తమైన యాప్‌ను వారికోసం రూపొందించి విడుదల చేశామన్నారు. మే1న కార్యాలయంలో ఉచితంగా సెమినార్ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సంస్థ ఎండీ శాంతిస్వరూప్, కోఆర్డినేటర్లు ఉంగరాల సింధులహరి, నామన ప్రసన్న, శ్రీసత్య, సృజన, కల్యాణి పాల్గొన్నారు. వివరాలకు సెల్ 8919050676ను సంప్రదించాలన్నారు.

వరి కోతల్లో ఇబ్బంది రాకూడదు

అల్లవరం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రస్తుతం వరి కోతలు ప్రారంభమైనందున రైతులకు కూలీల కొరత రాకుండా ఫీల్డుఅసిస్టెంట్లు ఉపాధి పనులు ప్లాన్ చేసుకోవాలని ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్ అన్నారు. బుధవారం స్థానిక మండలపరిషత్ కార్యాలయం వద్ద ఉపాధి ఫీల్డు అసిస్టెంట్లు, సిబ్బందితో సమావేశం జరిపారు.

విలువలతో కూడిన విద్యాబోధనతోనే ఉన్నత భవిష్యత్


కేఆర్ఎస్ ప్రసాద్‌ను సత్కరిస్తున్న డీఈవో సలీంబాషా తదితరులు

అమలాపురం టౌన్, ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి): విలువలతో కూడిన విద్యాబోధనతోనే భవిష్యత్తు సమాజం ఉన్నత స్థానంలో ఉంటుందని డీఈవో డాక్టర్ షేక్ సలీంబాషా పేర్కొన్నారు. విద్యార్థులకు పాఠశాల స్థాయి నుంచి ధార్మిక, ఆధ్యాత్మిక, నైతిక విలువలతో కూడిన విద్యాబోధన చేయాలని ఉపాధ్యాయులకుసూచించారు. అమలాపురం గొల్లగూడెంలోని మౌలానా అబుల్‌కలాం ఆజాద్ పురపాలక సంఘ ఉర్దూ ప్రాథమిక పాఠశాల 107వ వార్షికోత్సవం హెచ్ఎం ఎంఎంకేజీ మొయినుద్దీన్ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డీఈవో సలీంబాషా మాట్లాడుతూ గొల్లగూడెం ఉర్దూ ప్రాథమిక పాఠశాల నూతనవిద్యా సంవత్సరం నుంచి మోడల్ ప్రాథమిక పాఠశాలగా ఎంపిక చేశామన్నారు. ఒక్కో తరగతికి ఒక్కో ఉపాధ్యాయుడు చొప్పున ఐదుగురు ఉపాధ్యాయులు ఉంటారని, పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇదే పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఎం.హాస్సేన్ రాష్ట్ర ఉర్దూ ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకోగా, స్కూలుఅసిస్టెంట్‌గా పదోన్నతి పొంది మరొక ఉన్నత పాఠశాలకు బదిలీపై వెళుతున్న కేఆర్ఎస్ ప్రసాద్‌లను డీఈవో సలీంబాషా ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయులు ఎంఎస్ఎన్ మూర్తి, బీవీఎస్సీ పోలిశెట్టి, అనూష పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి కట్టుబడి ఉన్న ప్రభుత్వం


దివ్యాంగులకు సహాయ పరికరాలను పంపిణీ చేసిన డీఆర్వో రాజకుమారి, చిత్రంలో డీఈవో సలీంబాషా

అమలాపురం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని జిల్లా రెవెన్యూ అధికారి బీఎల్ఎన్ రాజకుమారి పేర్కొన్నారు. దివ్యాంగుల సంక్షేమానికి ఎన్నో కార్యక్రమాలు అమలు చేస్తుందన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం డీఆర్వో దివ్యాంగులకు ఉపకరణాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దివ్యాంగుల స్వతంత్రను, జీవన నాణ్యతను మెరుగు పరిచేందుకు, విద్యను అభ్యసించేందుకు ఈఉపకరణాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. జిల్లా సర్వశిక్షాభియాన్, విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో కదలలేనివారికి వీల్‌ఛైర్లు, నడవడానికి ఊతకర్రలు, బ్యాలెన్స్ మద్దతు కోసం చేతికర్రలు, వినికిడి లోపం ఉన్నవారికి వినికిడి యంత్రాలు, దృష్టిలోపం ఉన్న వారికి కళ్లద్దాలు, అంధులకు బ్రెయిలీ లిపి స్లాట్స్, కృత్రిమ అవయవాలు, మూడు చక్రాల వాహనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా, కలెక్టరేట్ పరిపాలనాధికారి కడలి కాశీవిశ్వేశ్వరరావు, కోఆర్డినేటర్లు ఎంబీటీ సత్యనారాణ, డాక్టర్ ఎంఏకే భీమారావు, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'దరియాలతిప్పలో పొలంబడి'

యానాం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): యానాం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఆత్మపథకంలో భాగంగా పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. నాలుగవ విడతల్లో భాగంగా రైతులకు రబీ సాగులో మెలకువలు, ఖరీఫ్‌లో చేపట్టవలసిన పొలం పనులు, విత్తనాల రకాలు, కలుపు నివారణ మందులు, చీడపీడల నివారణపై సూచనలను పెద్దపురం ఏరువాక ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సీతారామశర్మ వివరించారు. కార్యక్రమాన్ని వ్యవసాయశాఖ డీడీ శివసుబ్రహ్మణ్యం, ఏవో చిక్కాల జోగిరాజు, విజయ్‌కుమార్, రూప, చిన్నబాబు రైతులు పాల్గొన్నారు.

మే 1 నుంచి అమలాపురంలో బాస్కెట్‌బాల్ శిక్షణ శిబిరం

అమలాపురం టౌన్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): అమలాపురం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో బాస్కెట్‌బాల్ అసోసియేషన్, కేజీకే గోఖలే అండ్ కేపీఆర్ మెమోరియల్ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో విద్యార్థులకు శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు తెలిపారు. మే 1నుంచి జూన్ 1వ రకు ప్రతీరోజు ఉదయం 6నుంచి సాయంత్రం 5గంటల వరకు శిక్షణ ఇస్తారు. అండర్-10, 12, 14,18 విభాగాల్లో బాలబాలికలకు ఎంచుకున్న సమయాలను అనుసరించి శిక్షణ ఇస్తారన్నారు. సీనియర్ కోచ్ ఆకుల ఉమామహేశ్వరరావు, ఇండియన్ ప్లేయర్ ఎన్.అప్పలరాజు, ఎస్.గంగాధర్, కుడుపూడి సుబ్రహ్మణ్యం, యనమదల బుజ్జిలు క్రీడాకారులకు శిక్షణ ఇస్తారని వివరించారు. ముందుగా విద్యార్థులు కోచింగ్ క్యాంపులో పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు.

ఆర్థిక సహాయం

మలికిపురం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): చింతలమోరికి చెందిన నల్లి ఊర్మిళకు రెండు కిడ్నీలు పాడవడంతో గాడ్స్‌గాస్పెల్ ఫౌండేషన్ ఫౌండర్ జిల్లెల్ల ఉదయ్‌కిరణ్ ద్వారా సేకరించిన రూ.16వేలు, కువైట్ నుంచి జీసెస్ హోప్ చారిటీ ఫౌండేషన్ అధినేత జిల్లెల్ల బాబుప్రసాద్ ద్వారా సేకరించిన రూ.17వేలు మొత్తం రూ.31వేలను ఎంపీటీసీ తోటే రాజేష్ బుధవారం ఆమెకు అందజేశారు. చారిటీ సభ్యులు రాజబాబు, నల్లి గోపి, చవ్వాకుల థామస్, సూరిబాబు పాల్గొన్నారు.

దేవాలయాల వద్ద మజ్జిగ చలివేంద్రాలు


ఐ.పోలవరం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): దేవదాయశాఖ ఆదేశాలతో ప్రముఖ ఆలయాల వద్ద మజ్జిగ చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. మురమళ్ళ భద్రకాళీసమేతవీరేశ్వరస్వామి ఆలయం వద్ద చలివేంద్రం ఏర్పాటుతో భక్తులు సేదతీరి ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

రైతులకు పవర్‌టిల్లర్ల పంపిణీ


పవర్ టిల్లర్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురం టౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి రైతు సాగు పెట్టుబడిని తగ్గించే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పేర్కొన్నారు. జిల్లాలో తొలిసారిగా డ్రోన్ టెక్నాలజీని వినియోగించి రైతులకు ప్రధాన సమస్యగా ఉన్న కూలీల కొరతను తగ్గించడంతో పాటు తక్కువ సమయంలో తక్కువ ఖర్చుతో సాగు విధానాలకు రూపకల్పన చేయడం జరిగిందన్నారు. త్వరలోనే డ్రోన్ టెక్నాలజీ అమలులోకి రానున్నట్టు 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఆయన తెలిపారు. అమలాపురం టీడీపీ క్యాంపు కార్యాలయం వద్ద బుధవారం నియోజకవర్గానికి మంజూరైన పవర్ టిల్లర్లను లబ్ధిదారులకు ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, నల్లా చిట్టిబాబు, వాసురాజు, వ్యవసాయాధికారి కడలి ధర్మప్రసాద్‌పాల్గొన్నారు.

హోమియో వైద్యుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మోహన్



అమలాపురం టౌన్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): హోమియో వైద్యుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా అమలాపురం పట్టణానికి చెందిన డాక్టర్ బీఎస్ మోహన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గుంటూరులోని హిందూ ఫార్మసీ కళాశాల ఆడిటోరియంలో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోమియోపతి ఫిజీషియన్స్ (ఐఐహెచ్‌పీ) రాష్ట్ర శాఖ వైద్య సదస్సు నిర్వహించారు. జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కేఎస్ఎస్ శివమూర్తి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. 2025-27 కాలానికి రాష్ట్ర శాఖ నూతన కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. రాష్ట్ర శాఖ అధ్యక్షుడిగా గుంటూరుకు చెందిన డాక్టర్ డి.సురేంద్రనాథ్ ఎన్నికకాగా కోశాధికారిగా కాకినాడకు చెందిన ఎంఎస్సార్‌శాస్త్రి, ఉపాధ్యక్షుడిగా డాక్టర్ బీఎస్ మోహన్ తదితరులను ఎన్నుకున్నారు. డాక్టర్ మోహన్ గతంలో ఐఐహెచ్‌పీ కోనసీమ విభాగం కన్వీనర్‌గా పనిచేశారు. ప్రస్తుతం జర్మనీలోని అంతర్జాతీయ హోమియో వైద్య సంఘం సభ్యునిగాను, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కోనసీమ శాఖ అసోసియేట్ మెంబర్‌గా పనిచేస్తున్నారు.

పౌష్టికాహార పక్షోత్సవం

మలికిపురం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పౌష్టికాహార పక్షోత్సవంలో భాగంగా మోరి సెక్టార్ పరిధిలోని వియ్యారివారి మెరక 159 అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మొదటి వెయ్యి రోజులు సంరక్షణపై శ్రద్ధ వహించడం గురించి, పిల్లల బరువు, లోపాలను గుర్తించడం, ఊబకాయాన్ని తగ్గించడానికి ఆరోగ్యకరమైన జీవనశైలిపై తల్లులకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లబ్ధిదారులకు పారదర్శకంగా సేవలు అందిస్తున్నట్టు సీడీపీవో రమాదేవి తెలిపారు. సూపర్‌వైజర్ కె.చంద్రకళ, అంగన్‌వాడీ కార్యకర్తలు కె.రత్నకుమారి, ఎ.నందిని, కె.జ్యోతి, కె.శేషవేణి, నాగజ్యోతి, కుమారిదుర్గ, నాగమ్మ, సత్యరాజేశ్వరి, కిరణ్‌జ్యోతి, తల్లుల కమిటీ సభ్యురాళ్లు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కరెంటు కష్టాలు

ఉప్పలగుప్తం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని రెండు సబ్‌స్టేషన్ల పరిధిలో ఎల్ఆర్ పేరుతో కరెంటు కోతలు కొనసాగుతున్నాయి. మంగళవారం రాత్రి ముందుగా చెప్పిన దానికి భిన్నంగా కోతలు అమలు చేయడంతో ప్రజలు నానా ఇక్కట్లు పడ్డారు. ఫీడర్లవారీగా కోతలు ఉంటాయని చెప్పిన అధికారులు కొన్ని ఫీడర్లపై రాత్రంతా కోత అమలుచేశారు. 5మెగావాట్ల విద్యుత్తు మాత్రమే మండలానికి కేటాయించడంతో రెండు సబ్‌స్టేషన్ల పరిధిలో పంపిణీలో అధికారులు విఫలమయ్యారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. మారుమూల ప్రాంతాల ఫీడర్లకు ఎక్కువ కోత విధించి, ప్రధాన మార్గాల్లో అప్పుడప్పుడూ కోత ఉండేలా చర్యలు తీసుకున్నారు. బుధవారం కూడా అదేవిధానం అమలుచేస్తామని సిబ్బంది ప్రకటించడం గమనార్హం.

తొలి తెలుగు వెలుగు కందుకూరి

ఐ.పోలవరం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): సంఘ సంస్కరణ ఉద్యమ తొలి తెలుగు వెలుగు కందుకూరి వీరేశలింగం పంతులని పలువురు వ్యాఖ్యానించారు. కందుకూరి జయంతిని పీటీఎం ఆధ్వర్యంలో నిర్వహించారు. సాహితీ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పుల్లెపు వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి జీవీఎస్ఎన్ మూర్తి, ఎస్ఎన్ మూర్తి, కేవీ సత్యనారాయణ, రాయపురెడ్డి బాణేశ్వరరావు, ఏఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు.

గర్భిణులకు సీమంతాలు

ఐ.పోలవరం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా కొమరగిరిలో బుధవారం ఐసీడీఎస్ విస్తరణ అధికారిణి సీహెచ్ నాగలక్ష్మి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. గర్భిణులు ఆరోగ్య రక్షణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై వివరించారు. పిల్లల్లో పోషక లోపాన్ని నివారించడం, ఊబకాయాన్ని తగ్గించి ఆరోగ్యవంతమైన జీవన శైలిని అలవాటు చేయడం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. 17మంది గర్భిణులకు చీర, సారెలతో సీమంతం జరిపారు. సర్పంచ్ వరసాల విజయచాముండేశ్వరిసూర్యనారాయణ, సాకా సీతాదేవి, గాదిరాజు బుచ్చికృష్ణంరాజు, పెన్మెత్స శరత్‌రాజు, పెన్మెత్స కిశోర్‌రాజు, ఆకుల సత్తిబాబు, పంచాయతీ కార్యదర్శి ఎన్.నాగార్జున, అంగన్‌వాడీ కార్యకర్తలు జయలక్ష్మి, సుబ్బలక్ష్మి,మీనాక్షి పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో సామూహిక వ్రతాలు

అయినవిల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): నల్లచెరువు గ్రామంలో గల శ్రీపద్మావతి గోదాదేవి సమేత శ్రీవేంకటేశ్వరాలయంలో సామూహిక వ్రతాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బుధవారం శ్రీరామ సత్యనారాయణస్వామి, శ్రీ వేంకటేశ్వరస్వామి వ్రతాలను ఆలయ ప్రధానార్చకులు శ్రీనివాస సత్యశ్రీరామకల్యాణాచారి ఆధ్వర్యంలో పండితులు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త గణేశుల వెంకటేశ్వరరావు-వెంకటసూర్యపద్మావతి ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించారు. భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి రమా సత్యనారాయణస్వామి, శ్రీరమావేంకటేశ్వరస్వామి వ్రతాల్లో పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన

అంతర్వేది, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలంలో మూడు సెక్టార్లలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. మోరి, అడ్డాలపాలెం, సఖినేటిపల్లి తదితర గ్రామాల్లో అంగన్‌వాడీ సిబ్బందితో కలిసి పోషకాహారంపై ప్రజలకు అవగాహన కల్పించారు. బాలింతలు, చిన్నారుల్లో ఆరోగ్యం, తల్లిపాల ప్రాముఖ్యత, మహిళల్లో రక్తహీనతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్కే మీరామున్నీసా, వై.విజయభారతి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అంబాజీపేట మార్కెట్ కమిటీ చైర్మన్‌గా చిట్టూరి



పి.గన్నవరం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): అంబాజీపేట మార్కెట్ కమిటీ చైర్మన్‌గా టీడీపీ అయినవిల్లి మండల అధ్యక్షుడు చిట్టూరి శ్రీనివాస్‌ను నియమించారు. బుధవారం ప్రభుత్వం విడుదల చేసిన జాబితాలో శ్రీనివాస్ పేరు ఉంది. దీంతో రెండు రోజులుగా అంబాజీపేట మండలంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలకు తెరపడినట్టు అయింది. టీడీపీ అయినవిల్లి గ్రామశాఖ అధ్యక్షుడిగా, తెలుగుయువత మండల అధ్యక్షుడిగా, అయినవిల్లి మండల ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్ పనిచేశారు. 2015 నుంచి టీడీపీ అయినవిల్లి మండల అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. తనకు చైర్మన్ పదవి ఇచ్చినందుకు సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలోని నగరం మార్కెట్ కమిటీని జనసేనకు కేటాయించి మామిడికుదురు మండలానికి చెందిన పెనుమాల లక్ష్మి పేరును ఇప్పటికే ప్రకటించారు.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

ముమ్మిడివరం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): అప్రమత్తంగాఉండి అగ్ని ప్రమాదాలు జరగకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అగ్నిమాపక అధికారి కేవీ మురళీకొండబాబు సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ముమ్మిడివరం పట్టణంలో బుధవారం ప్రజలకు అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ముమ్మిడివరంలోని అపార్టుమెంట్లలో ఉన్న ప్రజలకు అగ్నిప్రమాదాల నివారణపై ముద్రించిన కరపత్రాలు అందించి అవగాహన కల్పించారు. గ్యాస్ సిలిండర్ అగ్నిప్రమాదానికి గురైతే ఏరకమైన చర్యలు చేపట్టాలనే విషయంపై మాక్‌డ్రిల్ నిర్వహించారు. అగ్నిమాపక కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

జ్వర పీడితులకు మలేరియా పరీక్షలు చేయాలి

ఐ.పోలవరం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): జ్వరపీడితులకు మలేరియా పరీక్షలు చెయ్యాలని జిల్లా మలేరియా అధికారి నక్కా వెంకటేశ్వరరావు సూచించారు. బుధవారం ఆయన జి.వేమవరం, కేశనకుర్రు పీహెచ్‌సీలను సందర్శించారు. సీజనల్ వ్యాధులపై ఆరోగ్యకేంద్ర సిబ్బందితో చర్చించారు. సీజన్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమం చేపట్టాలని ఆదేశించారు. పీహెచ్‌సీ రికార్డులు పరిశీలించి ల్యాబ్ టెక్నీషియన్లకు సూచనలు చేశారు. దోమల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వైద్యాధికారులు ఇందిరాశ్రీ, ఎంఎస్ రాజేష్‌బాబు, సబ్ యూనిట్ ఆఫీసర్ పీఎస్‌వీ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

జిల్లా స్థాయి చెస్ పోటీల్లో ప్రతిభ

అమలాపురం టౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): సమనస ఢిల్లీ పబ్లిక్ స్కూలులో జరిగిన జిల్లా స్థాయి చెస్ పోటీల్లో అమలాపురం విక్టరీ అకాడమీ విద్యార్థులు అద్భుత ప్రతిభ చాటారు. నగదు బహుమతులు అందుకున్న తొలి పది స్థానాల్లో ఏడుగురు విక్టరీ అకాడమీ విద్యార్థులేనని ప్రిన్సిపాల్ తాడి వెంకటసురేష్ తెలిపారు. బండారు నానిబాబు ప్రథమస్థానం సాధించి రూ.4వేలు, ద్రాక్షారపు సాత్విక్ ద్వితీయస్థానంతో రూ.3వేలు, తాడి సాయివెంకటేష్ తృతీయస్థానంతో రూ.2వేలు నగదు బహుమతులతో పాటు షీల్డులు అందుకున్నారు. నల్లా రోహిత్‌కుమార్, యర్రంశెట్టి చరణ్‌లు రూ.వెయ్యి చొప్పున నగదు బహుమతులు అందుకున్నారు. వీరితో పాటు ఫణిశెట్టి సాయిఅవినాష్, ఫణిశెట్టి ధరణిలు నగదు ప్రోత్సాహక బహుమతులు అందుకున్నారు. పాఠశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో విజేతలైన చెస్ క్రీడాకారులను పలువురు ప్రముఖులు అభినందించారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

రాజోలు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కడలి గ్రామ పంచాయతీ వద్ద సర్పంచ్ చొప్పల గుణనాథ్ అధ్యక్షతన బుధవారం గ్రామసభ జరిగింది. నవధాన్యాల సాగుపై రైతులతో చర్చించారు. ఈసందర్భంగా సర్పంచ్ గుణనాథ్ మాట్లాడుతూ రైతులందరూ ప్రకృతి వ్యవసాయాన్ని ఆచరించాలన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయం చేసిన రైతులను సన్మానించారు. కార్యక్రమంలో వడ్లమూడి ప్రకాష్, యల్లమిల్లి ఆనందరాజు, అరవ జగన్నాథం, బొడ్డపల్లి రవి, ప్రకృతి వ్యవసాయ కడలి యూనిట్ ఇన్‌చార్జి ఎం.శ్రీనివాసరావు, బి.కిరణ్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, వీవోఏలు, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

వెంకన్న ఒక్కరోజు ఆదాయం రూ.3.19లక్షలు

ఆత్రేయపురం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీ నెలకొంది. నోము ఆచరించిన భక్తజనం అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు చేశారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తులు అన్న ప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.3,19,840 వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. భక్తుల దాహార్తి నింపేందుకు మజ్జిగ చలివేంద్రాలను ఏర్పాటు చేశారు.


వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి


టీడీపీ క్యాంపు కార్యాలయంలో వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే బండారు

రావులపాలెం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం టీడీపీ క్యాంపు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఆయన ప్రజల వినతులు స్వీకరించారు. వాటిని ఆయా శాఖల వారీగా అధికారులకు పంపి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అనంతరం కార్యకర్తల సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు చిలువూరి సతీష్‌రాజు, మండల శాఖ అధ్యక్షుడు గుత్తుల పట్టాభిరామారావు, జక్కంపూడి వెంకట స్వామి, మేడపాటి కాసురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పేరవరంలో ప్రకృతి వ్యవసాయ సాగుపై ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ప్రకృతి వ్యవసాయం ఎంతో లాభదాయకం

ఆత్రేయపురం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం ఎంతో లాభదాయకమని స్థానిక సర్పంచ్ గంటి విజయభారతి అన్నారు. బుధవారం పేరవరంలో ప్రకృతి వ్యవసాయ సాగుపై గ్రామసభ నిర్వహించారు. నవధాన్యాలు, పంట పొలాల్లో వేసుకోవడం ద్వారా సూక్ష్మపోషకాలు వృద్ధి చెందుతాయన్నారు. రైతులు ప్రకృతి వ్యవసాయం చేపట్టడం ద్వారా ఆరోగ్యం కలుగుతుందన్నారు. నవధాన్యాల సాగు చేపట్టాలని ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గంటి నాగేశ్వరరావు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కస్తూరి, అన్నపూర్ణ, వీరబాబు, ఝాన్సీ, మార్తమ్మ, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

వల్లూరులో చెరువుగట్టుపై ఆక్రమణల తొలగింపు


వల్లూరులో చెరువుగట్టుపై ఆక్రమణలను తొలగిస్తున్న అధికారులు

కపిలేశ్వరపురం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని వల్లూరు గ్రామంలోని పెద్దచెరువు గట్టుపై ఉన్న ఆక్రమణలను బుధవారం పంచాయతీ, రెవెన్యూ, పోలీస్ అధికారుల సమక్షంలో తొలగించారు. చెరువుగట్టుపై ఆక్రమణలు తొలగించాలంటూ సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో ఎంపీడీవో కె.రత్నకుమారి సమక్షంలో ఈవోపీఆర్డీ మోహన్, ఆర్ఐ అర్జమ్మ, ఎస్ఐ రవి కుమార్, గ్రామ కార్యదర్శి సత్తిబాబు, పలు గ్రామాల కార్యదర్శులు, పంచాయతీ, సచివాలయ, పోలీస్ సిబ్బంది ఆక్రమణల తొలగింపు చేపట్టారు. ఈసందర్భంగా ఎంపీడీవో రత్నకుమారి, ఈవోపీఆర్డీ మోహన్, గ్రామకార్యదర్శి సత్తిబాబు లు మాట్లాడుతూ ఆక్రమణల తొలగింపుపై అయిదేళ్లుగా ఆక్రమణదారులకు నోటీసులు అందజేస్తున్నట్లు, 3 నెలల క్రితం కూడా నోటీసులు అం దించినట్టు తెలిపారు. వారు స్పందించకపోవడంతో చెరువుగట్టుపై ఉన్న 20 ఇళ్లను తొలగిస్తున్నట్లు వారు తెలిపారు. వీరిలో 9 మందికి ఇళ్ల స్థలాలు, గృహాలు లేకపోవడంతో వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసేందుకు కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ప్రొటోకాల్ పాటించలేదంటూ సమావేశం బహిష్కరణ

రావులపాలెం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ప్రొటోకాల్ ప్రకారం ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లకు సమాచారం ఇవ్వడం లేదంటూ వైసీపీ సభ్యులు మండల పరిషత్ సమావేశాన్ని బహిష్కరించారు. రావులపాలెం మండల పరిషత్ సమావేశం బుధవారం నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఉదయం 10 గంటలకు ఎంపీడీవో మహేష్, తహశీల్దారు ముక్తేశ్వరరావు, ఇతర శాఖల అధికారులు, ముగ్గురు టీడీపీ మహిళా ఎంపీటీసీలు హాజరయ్యారు. ఎంపీపీ కర్రి లక్ష్మివెంకటనాగదేవి, జడ్పీటీసీ కూడిపూడి శ్రీనివాసరావు, వైసీపీ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఎంపీపీ ఛాంబర్లో సమావేశమయ్యారు. సమావేశానికి సమయం అయ్యిందని మీటింగ్ హాలులోకి రావాలని ఎంపీడీవో వారికి పలుమార్లు సమాచారం అందించారు. వారంతా 12 గంటల ప్రాంతంలో మీటింగ్ హాలులోకి వచ్చిన అనంతరం ఎంపీపీ మాట్లాడారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ మండల సమావేశపు తేదీ అంశాన్ని ఎంపీపీతో చర్చించామన్నారు. సమావేశాన్ని నిర్వహించేందుకు కోరం లేని కారణంగా మండల సమావేశాన్ని వాయిదా వేస్తున్నామన్నారు. టీడీపీ మహిళా ఎంపీటీసీలు మాట్లాడుతూ మీటింగ్ వాయిదా పడుతుందని తెలిసినప్పుడు అధికారులు మమల్ని ఎందుకు ఇంతసేపు కూర్చోబెట్టారని మండిపడ్డారు. మీము మీతోటి ఎంపీటీసీలమేగా మాకు ముందుగా జరిగే అంశాన్ని చెప్పాలి కదా అని ఎంపీపీని ప్రశ్నించారు.


సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్లు వినతి పత్రం అందిస్తున్న ప్రజా ప్రతినిధులు

బడ్జెట్ సమావేశాన్ని రాజకీయం చేయడం తగదు

రావులపాలెం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఉపయోగపడే బడ్జెట్ సమావేశాన్ని రాజకీయం చేయడం వైసీపీకే చెల్లిందని టీడీపీ నాయకులు అన్నారు. రావులపాలెంలోని పార్టీ క్యాంపు కార్యాలయం వద్ద నిర్వహించిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ మండల పరిషత్ బడ్జెట్ సమావేశాన్ని బహిష్కరణ పేరుతో వైసీపీ రాజకీయం చేస్తున్నదన్నారు. ప్రజలను తప్పుదారి పట్టించే విధంగా వైసీపీ ప్రజాప్రతినిధులు వ్యవహరించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో గుత్తుల పట్టాభి రామారావు, ముత్యాల బాబ్జీ, కోట వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు జడ్పీ సమావేశంలో వేగుళ్ల సందడి

మండపేట, ఏప్రిల్, 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా అధికార హోదాలో చిత్తూరు జిల్లా పరిషత్ సమావేశంలో మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పాల్గొన్నారు. ఆయనకు జిల్లా కలెక్టర్ స్వాగతం పలికారు. ముందుగా అంచనాల కమిటీ సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. అధికారులకు ఆయన పలు సూచనలు, సలహాలు చేశారు.

జాబ్‌మేళాలో 30 మంది ఎంపిక

మండపేట, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మండపేట ఆలమూరు రోడ్డులో వున్న విజ్ఞాన్ డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన జాబ్‌మేళాకు అభ్యర్థుల నుంచి స్పందన వచ్చింది. కళాశాలలో నిర్వహించిన జాబ్‌మేళాకు 60 మంది ఇంటర్యులకు హాజరయ్యారు. 2024-25లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ఇంటర్వ్యూలు జరిపారు. దీనికి 80 మంది హాజరు కాగా 35 మంది ఎంపికయ్యారని నిర్వాహకులు తెలిపారు. విజ్ఞాన్ కళాశాల డైరెక్టర్ బాబీ, అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విజ్ఞాన్ సంస్థల చైర్మన్ ఇనపకోళ్ల గణేష్ చౌదరి హాజరయ్యారు. క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఎంపికైన అభ్యర్థులను ఆయన అభినందించారు.

చింతలూరులో గ్రాడ్యుయేషన్ డే

ఆలమూరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): చింతలూరు మండల పరిషత్ పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. చిన్నారులకు గ్రాడ్యుయేషన్ దుస్తులను వేసి వారికి ప్రత్యేక బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో బి.అప్పాజీ, ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

19న మండల సర్వసభ్య సమావేశం

రాయవరం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం 19న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎస్.కీర్తి స్పందన తెలిపారు. బుధవారం రాయవరంలో ఎంపీడీవో మాట్లాడుతూ ఎంపీపీ ఎన్.వెంకటరమణ అధ్యక్షతన జరిగే సమావేశానికి అన్ని శాఖల అధికారులు తమ నివేదికలతో హాజరుకావాలన్నారు.

తిరుమలలో మండపేట ఎమ్మెల్యే వేగుళ్లకు ఘన స్వాగతం


ఎమ్మెల్యే వేగుళ్లకు స్వాగతం పలుకుతున్న టీటీడీ ఓఎస్డీ నాయర్

మండపేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు తిరుమల శ్రీవారి ఆలయానికి తొలిసారిగా చైర్మన్ హోదాలో వెళ్లారు. బుధవారం తిరుపతిలో ఆయనకు ఆలయ ఓఎస్డీ నాయక్ మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామివారిని దర్శించు కున్నారని పార్టీ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.


షిర్డీసాయి మందిరంలో పూజలు చేస్తున్న సూర్యప్రకాష్ తదితరులు

షిర్డీసాయి వార్షికోత్సవం

ద్రాక్షారామ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం హసన్‌బాదలో ఉన్న షిర్డీసాయి మందిరంలో 23వ వార్షికోత్సవాన్ని ఘనంగా జరిపారు. ఉండి వీరభద్ర శర్మ ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ఠాపకులు సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు దంపతులతో పూజలు, అభిషేకం నిర్వహించారు. ఇళ్ల వీరబాబు ఆధ్వర్యంలో సామూహిక సత్య వ్రతాలు చేశారు. సాయంత్రం మంగళవాయిద్యాలతో సాయినాథుని ఊరేగింపు నిర్వహించారు. జడ్పీ మాజీ వైస్ చైర్మన్ చింతపల్లి వీరభద్రరావు, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పిల్లి సూర్యప్రకాష్, బి.బాబూరావు, చక్కా తాతాజీ, చిన సోమరాజు, కమిటీ సభ్యులు, పలువురు భక్తులు పాల్గొన్నారు.

మళ్లీ విజృంభిస్తున్న లంపీస్కిన్ వ్యాధి

• ఆవుదూడల్లోనే అధికం..వ్యాధి సోకిన దూడలు 50శాతం మృత్యువాత • పెంపకందారుల్లో ఆందోళన


గుమ్మిలేరులో లంపీస్కిన్ సోకిన పుంగనూరు ఆవుదూడలు

ఆలమూరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ఆవుజాతిలో వచ్చే లంపీస్కిన్ వ్యాధి అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో మళ్లీ విజృంభిస్తుండటంపై రైతుల్లో ఆందోళనలు నెలకొన్నాయి. ఇటీవల ఈ వ్యాధిసోకి పలు పశువులు మృత్యువాత పడినట్టు రైతులు వాపోతున్నారు. రెండేళ్ల క్రితం ఈ వ్యాధి విజృంభించినప్పుడు అనేక ఆవులు, ఆవుదూడలు మృతి చెందగా అనేక పశువులు ఈ వ్యాధి నుంచి నేటికీ కోలుకోలేదని పలువురు రైతులంటున్నారు. ఈ వ్యాధి అదుపులోకి వచ్చిందని భావిస్తున్న సమయంలో రెండు నెలలుగా పలు ప్రాంతాల్లో మళ్లీ బయటపడినట్టు తెలిసింది. ముఖ్యంగా రెండో విడతలో ఆవుదూడలపై అధిక ప్రభావం చూపిస్తున్నదని పాడి రైతులంటున్నారు. ఈ వ్యాధి వచ్చిన ఆవుదూడలు అధిక శాతం మృత్యువాత పడుతున్నట్లు సమాచారం. ముఖ్యంగా ఆవుదూడల్లో నోటిలో అధిక ప్రభావం చూపించడంతో ఆహారం తీసుకోలేకపోతున్నాయని రైతులంటున్నారు. దూడలు పాలు కూడా తాగలేక మరింత ఇబ్బందులు పడుతున్నట్టు వారంటున్నారు. దీంతో నీరసించి మృతి చెందుతున్నట్లు పాడి రైతులు చెబుతున్నారు. ఈ వ్యాధి అంటువ్యాధి కావడంతో మిగిలిన పశువులకు సోకే ప్రమాదం ఉందని పలువురు పాడి రైతులు వాపోతున్నారు.

హోమియో మందుల కోసం రైతులు ఆసక్తి: లంపీస్కిన్ వ్యాధి సోకిన ఆవులు, ఆవుదూడలకు హోమియో మందుల వల్ల ఉపశమనం కలిగిస్తుందని పాడి రైతులంటున్నారు. దీంతో రైతులు వాటి కోసం పరుగులు తీస్తున్నారు. ఆవుల పెంపకందారులు ముందు జాగ్రత్తగా ఈ వ్యాధి సోకకుండా వాటిని వాడుతున్నారు.

లంపీస్కిన్ ఆందోళన కలిగిస్తున్నది
రెడ్డి సత్తిబాబు, పుంగనూరు రైతు



ఆవుల పెంపకందారులను లంపీస్కిన్ వ్యాధి ఆందోళన కలిగిస్తున్నది. రెండేళ్ల క్రితం వచ్చిన ఈ వ్యాధితో అనేక పశువులు మృత్యువాత పడాయి. ఇప్పటికే తమ వద్ద ఉన్న రెండు దూడలకి ఈ వ్యాధి సోకి చనిపోయాయి. మరో రెండు దూడలకు వచ్చింది. ఈ వ్యాధి రాకుండా ముందుగా వ్యాక్సిన్ అందిస్తే ప్రయోజనం ఉంటుంది. వ్యవసాయశాఖ అధికారులు దీనిపై యుద్ధప్రాతిపదికన దృష్టిసారించాలి.

ఎంపీపీ వాకౌట్‌తో అర్ధాంతరంగా ముగిసిన సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మణరావు

ఆలమూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలపై సర్పంచ్‌లకు సమాచారం ఇవ్వడం లేదని వైసీపీకి చెందిన సర్పంచ్‌లు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో ఆ పార్టీకి చెందిన ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు మండల సమావేశం నుంచి వాకౌట్ చేయడంతో సమావేశం అర్ధాంతరంగా ముగించారు. ఆలమూరు మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు అధ్యక్షతన బుధవారం ప్రారంభమైంది. సమా వేశం ప్రారంభంలోనే చెముడులంక సర్పంచ్ తమ్మన శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలపై సర్పంచ్‌లకు సమాచారం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశం నుంచి వైసీపీ సర్పంచ్‌లతోపాటు ఎంపీటీసీ సభ నుంచి వాకౌట్ చేశారు. వారికి మద్దతుగా ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు వాకౌట్ చేయడంతో సమావేశం సభాధ్యక్షుడు లేకుండా నడపడం వీలు కాదని అందువల్ల సమావేశాన్ని ముగిస్తున్నట్లు ఎంపీడీవో ఎ.రాజు తెలిపారు. ప్రభుత్వ పథకాలతోపాటు ప్రొటోకాల్ విషయంలో నిబంధనలు పాటిస్తున్నామన్నారు. బయటకు సంబంధించిన విషయాలతో తమకు సంబంధం లేదని ఎంపీడీవో అన్నారు. సర్పంచ్‌లకు, ఎంపీటీసీలకు సకాలంలో సమాచారం అందించేలా కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. సమావేశంలో మండల పరిషత్ ప్రత్యేకాధికారి శాంతికుమారి, జడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి, తహశీల్దార్ ప్రకాష్‌బాబు, ఏవో మెహర్‌ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపుల నిందితుడిని కఠినంగా శిక్షించాలి

రాయవరం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): బాలికను లైంగిక వేధింపులకు గురిచేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం రాయవరంలో సీఐటీయూ మండల కన్వీనర్ డి.ఆదిలక్ష్మి మాటాడుతూ భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు ఎస్.కృష్ణకుమారి, సత్యవేణి తదితరులు పాల్గొన్నారు.

కోరుకొండ ఆలయానికి రోప్‌వే ఏర్పాటుపై బీజేపీ నేతల హర్షం

మండపేట, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి) కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి కేంద్ర ప్రభుత్వం రోప్‌వేను మంజూరు చేయటంపై బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కె.సత్యనారాయణ హర్షం వ్యక్తం చేశారు. పర్యాటక పుణ్యక్షేత్రాల అభివృద్ధికి కేంద్రం తీసుకుంటున్న చర్యల్లో భాగంగా స్వామివారి ఆలయం మరింత అభివృద్ధి జరుగుతుందన్నారు. రోప్‌వే ఏర్పాటు చేయటం వల్ల ఇబ్బందులు తొలగిపోతాయన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తులు చేసుకోండి

ఆలమూరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్ రుణాల కోసం బుధవారం నుంచి మే 10వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవచ్చునని ఆలమూరు ఎంపీడీవో ఎ.రాజు తెలిపారు. లబ్ధిదారులు రాష్ట్రానికి చెందిన వారై ఉండాలని కులధృవీకరణ పత్రాలతో దరఖాస్తులు ఆన్‌లైన్‌లో చేసుకోవచ్చునని తెలిపారు.

కుష్ఠువ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించాలి

కొత్తపేట, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): కుష్ఠువ్యాధిని ప్రారంభ దశలో గుర్తించడం ద్వారా అంగవైకల్యం రాకుండా నివారించవచ్చునని జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎం.దుర్గారావు దొర తెలిపారు. బుధవారం వానపల్లి పీహెచ్‌సీ పరిధిలో కొత్తపేట డివిజన్ వైద్యాధికారులకు, నోడల్ అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిక్షణలో వ్యాధిని ఎలా గుర్తించాలి, ఎలా నివారించాలనే దానిపై అవగాహన కల్పించారు. ఇప్పటి వరకూ నమోదైన కేసుల వివరాలు తెలిపారు. కార్యక్రమంలో అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ భరతలక్ష్మి, డిప్యూటీ జిల్లా అధికారి ఎం.వెంకటేశ్వర్లు, డివిజనల్ నోడల్ అధికారి చిక్కాల సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ అందరివాడు

కె.గంగవరం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ అందరివాడు అని సత్యవాడ అంబేడ్కర్ యూత్ సభ్యులు అన్నారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని సత్యవాడ పాఠశాలలో బుధవారం ఒక కార్యక్రమాన్ని నిర్వహించారు. అంబేడ్కర్ కొందరివాడు కాదు అందరివాడు నినాదంతో అయన సిద్ధాంతాలను ముందుకు తీసుకువెళ్లాలనే ప్రయత్నంలో భాగంగా సత్యవాడ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో అంబేడ్కర్ జీవిత చరిత్రపై వ్యాస రచన, డ్రాయింగ్, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలకు రూ. పది వేలు విలువ చేసే బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్యరామ్, గోపాలకృష్ణ, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఆలమూరులో జరిగిన నాటక ప్రదర్శనలో విజేతలకు బహుమతులు అందిస్తున్న దృశ్యం. పక్క చిత్రంలో కొత్తపేట వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వీరేశలింగం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు

కందుకూరి జీవితం ఆదర్శప్రాయం

తెలుగు రంగస్థల దినోత్సవ సభలో వక్తలు

ఆలమూరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): నేటి సమాజానికి కందుకూరి వీరేశలింగం పంతులు జీవితం ఆదర్శనీయమని పలువురు వక్తలన్నారు. ఆలమూరు శాఖా గ్రంథాలయంలో బాలమందిరం వ్యవస్థాపకుడు అంగర గోపాలకృష్ణ అధ్వర్యంలో కందుకూరి జయంతి, తెలుగు రంగస్థల దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ వేడుకల్లో పలువురు వక్తలు మాట్లాడారు. ఎంపీడీవో ఎ.రాజు మాట్లాడుతూ అన్యాయాలపై పోరాటం చేసి అనేక మందికి ఆదర్శంగా నిలిచారన్నారు. ఈసం దర్భంగా సందిపూడి మండల పరిషత్ స్కూల్ విద్యార్థుల నాటిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో బాలమందిరం వ్యవస్థాపకుడు కృష్ణశ్రీ, ఎంఈవో బి.అప్పాజీ, గ్రంథాలయ అధికారి తమ్మా నమశ్శివాయ, ఉపాధ్యాయులు ఎన్.శ్రీనివాసరావు,, నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

18న కందుకూరి జయంతి వేడుకలు: కందుకూరి వీరేశలింగం జయంతిని అభ్యుదయ రచయితల సంఘం, కోనసీమ జిల్లా జనవిజ్ఞాన వేదికల అధ్వర్యంలో రావులపాలంలో 18న కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ప్యాట్రన్ డాక్టర్ చల్లా రవికుమార్ తెలిపారు. ఆలమూరులో ఆయన వాటి వివరాలను బుధవారం తెలిపారు. కార్యక్రమంలో కవి సమ్మేళనం, కందుకూరి జయంతి వేడుకలు, కవులకు సత్కారాలు జరుగుతాయని ఆయన చెప్పారు.

వీరేశలింగం సేవలు మరువలేనివి

కొత్తపేట (ఆంధ్రజ్యోతి): కందుకూరి వీరేశలింగం సేవలు మరువలేనివని కొత్తపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు పేర్కొన్నారు. బుధవారం ఆయన జయంతిని పురస్కరించుకుని కళాశాల ప్రాంగణంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. స్థానిక విద్యా బాలమందిర్‌లో కరస్పాండెంట్ ఆర్.అనురాధ ఆధ్వర్య ంలో వీరేశలింగం జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ద్వారపూడిలో జయంతి వేడుకలు

మండపేట, (ఆంధ్రజ్యోతి): కందుకూరి వీరేశ్వరలింగం జయంతిని ద్వారపూడి ప్రభుత్వ జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో బుధవారం జరిపారు. ఈ సందర్భంగా కందుకూరి చిత్రపటానికి విద్యార్థులు నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కె.మురళీకృష్ణ, హెచ్ఎం విజయజ్యోతి, ఉపాధ్యాయులుతదితరులు పాల్గొన్నారు.


మండపేట మండలం ద్వారపూడిలో కందుకూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు


సత్యవాడలో భూమిపూజ చేస్తున్న దృశ్యం

ఆంజనేయస్వామి ఆలయానికి భూమిపూజ

కె.గంగవరం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): సత్యవాడ గ్రామంలో ప్రసన్నాంజనేయస్వామి ఆలయం నిర్మించడానికి బుధవారం భూమి పూజ చేశారు. ప్రధాన రహదారిలో చెరువు గట్టున ఆలయ నిర్మాణంతో పాటు 45 అడుగుల ఎత్తులో స్వామివారి విగ్రహం ఏర్పాటు చేయనున్నారు. ఈ సందర్భంగా జరిగిన భూమిపూజలో సలాది విష్ణువీర వెంకట సత్యనారాయణ, సత్యసాయి జ్యోతి దంపతులు పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పంపన నాగమణి, తోట పృథ్వీరాజ్, పల్లి సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

లోకాయుక్త ఫిర్యాదుతో విచారణ

రావులపాలెం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ఊబలంక నుంచి రావులపాలెం వరకు కాలువకు ఇరువైపులా ఆక్రమణలను తొలగించాలంటూ లోకాయుక్తలో ఫిర్యాదు చేసిన నేపథ్యంలో అధికారులు బుధవారం వాటిని పరిశీలించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం హైపర్ కమిటీ కన్వీనర్ జిల్లా పంచాయతీ అధికారి డి.శాంతలక్ష్మితో పాటు ఇతర శాఖల అధికారులు ఊబలంక పీహెచ్‌సీ వద్ద నుంచి రావులపాలెం జానీకమ్మరావి వరకూ ఇరిగేషన్ కాలువకు రెండు పక్కల ఉన్న ఆక్రమణలను పరిశీలించారు. దీనిపై శాంతలక్ష్మి మాట్లాడుతూ కేటగిరీల వారిగా పరిశీలించిన ఆక్రమణలను కలెక్టర్‌కు నివేదిస్తామని తెలిపారు.

ఈదురుగాలుల బీభత్సం.. పలు ఇళ్లకు పాక్షిక నష్టం

మండపేట, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ఏడిదలో మంగళవారం వీచిన ఈదురుగాలులు, భారీ వర్షానికి పలుచోట్ల కొబ్బరిచెట్లు, విద్యుత్ స్తంభాలు నెలకొరిగాయి. ఈదురుగాలుల దెబ్బకు పలు ఇళ్లు దెబ్బతినడంతోపాటు డాబాలపై ఉండే రేకుల షెడ్లు ఎగిరిపోయాయి. మరోపక్క కళ్లాల్లో ఆరబెట్టుకున్న ధాన్యం తడిసిపోయింది. గ్రామంలో పలుచోట్ల విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. తడిసిన ధాన్యాన్ని రైతులు ఆరబెట్టుకుంటున్నారు. ఆకస్మిక వర్షం దెబ్బకు పంట దిగుబడి తగ్గి నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు. దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలను విద్యుత్‌శాఖ అధికారులు పునరుద్ధరించి విద్యుత్ సరఫరాకు మార్గం సుగమం చేశారు. అకాల వర్షం కారణంగా నష్టపోయిన రైతులతో పాటు ఇళ్లకు వాటిల్లిన నష్టానికి ప్రభుత్వం పరిహారం ఇచ్చి ఆదుకోవాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు.


ఏడిదలో ఇంటిపైపడిన కొబ్బరిచెట్టు

ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సన్మానం


ప్రతిభ కనబర్చిన విద్యార్థులను సత్కరిస్తున్న దృశ్యం

రాయవరం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన రాయవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులను బుధవారం సన్మానించారు. ప్రిన్సిపాల్ ఎం.రామారావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కబర్చిన ఎంపీసీ విద్యార్థిని ఎం.అమృత వర్షిణి, బైపీసీ విభాగంలో ఎం.నందిని, సీఈసీ నుంచి కె.చండీప్రియ, హెచ్ఈసీ నుంచి పి.వెన్నెల ఉత్తమ ప్రతిభ కనబర్చి కళాశాలలో ఆయా గ్రూపుల్లో ప్రథమస్థానంలో నిలిచారు. వారిని ప్రిన్సిపాల్, అధ్యాపకులు సత్కరించారు. విద్యార్థులను గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ ఉండవిల్లి రాంబాబు తదితరులు అభినందించారు.

గ్రాడ్యుయేషన్ డేలో అలరించిన చిన్నారులు

ఆలమూరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): గ్రాడ్యుయేషన్ డే సందర్భంగా ఆలమూరు శ్రీ సిద్ధార్థ హైస్కూల్‌లో బుధవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. చిన్నారులు గ్రాడ్యుయేషన్ దుస్తుల్లో అలరించారు. గ్రాడ్యుయేషన్ డే వేడుకలను స్కూల్ డైరెక్టర్ కె.ముల్లారావు ప్రారంభించారు. ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా చిన్నారుల్లో నూతన ఉత్సాహాన్ని అందిస్తుందన్నారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.